

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

02.11.2026
సోమవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 123
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

కాంగ్రెస్ వానర సైన్యం ఢిల్లీకి మోదీ అనే రావణుడిని ఓడిస్తాం

- ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ
- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం: రేవంత్
- 13.5 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- 20 కోట్ల ఓట్ల తొలగింపునకు కుట్ర
- పేదల ఓట్లు తొలగిస్తున్నారని విమర్శ
- ఢిల్లీకి భారీగా చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు
- మోదీ, అమిత్ షాపై రేవంత్ ఫైర్
- గెలిచే వరకు పోరాటం ఆపబోమని స్పష్టీకరణ



హైదరాబాద్, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ శ్రేణులు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కదం తొక్కాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాడు రావణుడిని ఓడించేందుకు శ్రీరాముడికి వానర సైన్యం అండగా నిలిచినట్లే.. నేడు మోదీ అనే రావణుడిని ఓడించేందుకు తెలంగాణ నుంచి కాంగ్రెస్ వానర సైన్యం ఢిల్లీకి తరలివచ్చిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కార్యకర్తల సంకల్పం ముందు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తలవంచక తప్పదని అన్నారు. విజయం సాధించే వరకు విశ్రమించబోమని, కాంగ్రెస్ కార్యకర్తల పోరాటం ముందు మోదీ గద్దె దిగక తప్పదని వ్యాఖ్యానించారు.

2లో..

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నిర్వహించిన ఓటు బచావో.. దేశ్ బచావో నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఢిల్లీకి బయలుదేరే ముందు తెలంగాణ భవన్ పద్ద పార్టీ శ్రేణులను ఉద్దేశించి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. దేశంలో ఓటు హక్కును, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 400 స్థానాలు లభిస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను తొలగించే కుట్ర జరిగేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆ ప్రయత్నాలను అడ్డుకున్నందుకే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీలు, మహిళలపై మోదీ కక్ష పెంచుకున్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించి, ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 20 కోట్లకు చేరే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ తెచ్చింది ప్రకృతి కరువు కాదు.. ప్రభుత్వ కరువు

- ఆదిలాబాద్ సభలో కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్
- రేవంత్ పాలనలో రాష్ట్రం దివాలా: కేటీఆర్
- రైతుబంధు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- ఎకరానికి రూ.60 వేలు ఇవ్వాలని డిమాండ్
- కౌలు రైతులకూ రైతుబంధు ఇవ్వాలని విజ్ఞప్తి
- రైతు కూలీలకు రూ.36 వేలు చెల్లించాలని డిమాండ్
- బీజేపీ, కాంగ్రెస్ తోడుదొంగలంటూ విమర్శ
- రైతుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగింపు



హైదరాబాద్, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాలా తీయించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రైతుగర్జన సభలో ఆయన మాట్లాడారు. ''రాష్ట్రంలో రైతు బంధు బంద్ అయ్యింది. దిల్లీలో రాహుల్ గాంధీ ఖాతాలో మాత్రం ఈఎంఐ ప్రతి నెలా పడుతోంది. అది కట్టకపోతే రేవంత్‌రెడ్డి పదవి రెస్యువల్ కాదు. భాజపా, కాంగ్రెస్ తోడు దొంగలు.. ఇద్దరూ కలిసే దోచుకుంటున్నారు. ప్రతి పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని బడేభాయ్ మోదీ అన్నారు.. కానీ, వేశారా?. ఆదిలాబాద్‌లోని సీసీఐ ఫ్యాక్టరీని తుక్కు కింద మార్చేసి అమ్ముతున్నారు.

2లో..

రాప్తాడు విద్యార్థినిపై దాడి కేసులో ట్విస్ట్

- పోలీసుల కాల్పుల్లో నిందితుడికి గాయాలు

2లో..

- ఆత్మకూరు అడవుల్లో నిందితుడి కోసం పోలీసుల గాలింపు
- తప్పించుకునే ప్రయత్నంలో హేమంత్‌పై కాల్పులు?
- గాయపడిన నిందితుడికి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స
- బెంగళూరులో విద్యార్థినిని పరామర్శించిన మంత్రి లోకేశ్

రాబోయే 48 గంటలు కీలకం

- బాలిక కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటాను
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి
- ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుందని డాక్టర్లు అన్నారు
- బాలిక పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తా
- బాలిక త్వరగా కోలుకోవాలని ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని సూచించారు

2లో..




బెంగళూరు, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

అనంతపురం రాప్తాడు ఘటనలో గాయపడిన బాధిత బాలికను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి చూసి వచ్చారు. అక్కడ వైద్యులను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాలికతో పాటు వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ధైర్యం చెప్పారు.

ప్రత్యర్థులు రెచ్చగొట్టినా.. సంయమనం పాటించాలి

సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా కూటమి శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సరళి, క్షేత్రస్థాయిలో పరిస్థితులపై కూటమి పార్టీల ముఖ్యనేతలు, కేడర్‌తో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

2లో..

సిక్కు వ్యతిరేక అల్లర్ల రోజే ర్యాలీ ఎందుకు?


- రాహుల్‌ను ప్రశ్నించిన జేపీ నడ్డా!
- బనానా రిపబ్లిక్" కాదనే విషయాన్ని గుర్తించాలి
- ఇదంతా ఒక రాజకీయ నాటకమని ఫైర్
- ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

2లో..

సీఈసీని పదవి నుంచి తొలగిస్తాం

- 2024 ఎన్నికలు చెల్లవు
- జ్ఞానేశ్ కుమార్ జైలుకు వెళ్తారు
- రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
- ఇండియా కూటమి నిర్వహించిన బహిరంగసభ
- చివరకు జైలుకు వెళ్లాల్సి వస్తుంది
- లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలు, ఓటర్ల జాబితాల అవకతవకలు

5లో..



న్యూఢిల్లీ, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం ఇండియా కూటమి నిర్వహించిన బహిరంగ సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఆయనను సీఈసీ పదవి నుంచి తొలగిస్తామని.. చివరకు జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలు, ఓటర్ల జాబితాల అవకతవకల ద్వారా ఓట్ల చోరీ జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే 2024 ఎన్నికల ప్రక్రియనే అక్రమమని అభివర్ణించారు.

మీరు అక్కడే ప్రధాని అవ్వండి దేశానికి ఎప్పటికీ కాలేరు

రాహుల్ గాంధీపై అమిత్ షా సెటైర్స్



న్యూఢిల్లీ, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరోసారి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై మరోసారి మండిపడ్డారు. అమిత్ షా రాహుల్ గాంధీ నాయకత్వం, రాజకీయ ఆశయాలపై వ్యంగ్యాస్త్రాలను సంధించారు. చండీగఢ్‌లో ఒక సభలో ప్రసంగిస్తూ రాహుల్ గాంధీ 'మొహబ్బత్ కీ దుకాణ్' (ప్రేమ దుకాణం) నినాదంపై అమిత్ షా విమర్శలు గుప్పించారు.

2లో..

దూసుకొస్తున్న మురసు తుఫాన్

- పలు జిల్లాలకు హై అలర్ట్
- భారీ నుంచి అతి భారీ వర్షా లు!
- మంగళవారం నెల్లూరు, నరసాపురం మధ్య తీరం దాటే ఛాన్స్

5లో..

ఈ ఎన్నికలు రద్దు చేసి, రీపోలింగ్ నిర్వహించాలి

- వైఎస్ జగన్ డిమాండ్
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు
- పులివెందులలో రీపోలింగ్ నిర్వహించాలి
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను
- 70 పోలింగ్ బూత్‌లలోకి అనుమతించలేదు



5లో..

ఇస్రో సందర్శనకు ఎంపికైన భూపాలపల్లి యువకుడు

నేషనల్ స్పేస్ డే క్విజ్‌లో రెండో స్థానం

హైదరాబాద్, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన యువకుడు జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నాడు. అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తితో నిర్వహించిన క్విజ్‌లో పాల్గొని దేశవ్యాప్తంగా రెండో స్థానం సాధించాడు. ఈ విజయానికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కేంద్రాన్ని సందర్శించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన చాట్లపల్లి అనిల్ కుమార్ సాధించిన ఈ ఘనత స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం మల్లారం గ్రామానికి చెందిన అనిల్ కుమార్.. కేంద్ర ప్రభుత్వానికి చెందిన మైగవ్ వేదిక నిర్వహించిన నేషనల్ స్పేస్ డే క్విజ్ 2026లో పాల్గొన్నారు.

5లో..





ప్రత్యర్థులు రెచ్చగొట్టినా.. సంయమనం పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్నాయని, గతంలో జరిగిన ఏ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇంతటి స్ఫూర్తి కనిపించలేదని సీఎం తెలిపారు. కొన్ని మున్సిపాలిటీల్లో ఓటు వేసేందుకు ప్రజలు బారులు తీరుతున్నారని, మరికొన్ని ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉందని చెప్పారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని, వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూనే పోలింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే ఎన్నికల అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టేలా కుట్రపూరితంగా వ్యవహరించే అవకాశం ఉందని, కూటమి శ్రేణులు సంయమనం పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ వానర సైన్యం ఢిల్లీకి మోదీ అనే రావణుడిని ఓడిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్ల జాబితాలో 15 నుంచి 20 శాతం ఓట్లను తొలగించి మరోసారి అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర చేస్తోందని విమర్శించారు.

ఢిల్లీ నిరసన ర్యాలీకి కార్యకర్తలు వెళ్లకుండా అడ్డుకునేందుకు చివరి నిమిషం వరకు రైళ్లు కేటాయిస్తామని ఆశలు కల్పించి, చివరకు రైళ్లు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రయత్నించినా రైళ్లను నిలిపివేయగలిగారేమో కానీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీ చేరకుండా అడ్డుకోలేకపోయారని అన్నారు. వేలాది మంది కార్యకర్తలు ప్రత్యామ్నాయ మార్గాల్లో దేశ రాజధానికి చేరుకున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల గళం, కాంగ్రెస్ శ్రేణుల బలం ముందు కేంద్రంలోని పెద్దలు తలవంచక తప్పదని వ్యాఖ్యానించారు. మోదీ తన అధికారాన్ని కాపాడుకునేందుకు కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజిస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఓటు హక్కు పరిరక్షణ, ఓటర్ల జాబితాలో పారదర్శకత, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించడం వంటి అంశాలపై కాంగ్రెస్ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి రాంలీలా మైదానానికి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు బయలుదేరారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, నేతలు ఈ ర్యాలీలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. "ఇప్పటి వరకు 13.5 కోట్ల ఓట్లను తొలగించారు. రాబోయే రోజుల్లో 20 కోట్ల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది. ఢిల్లీలో మోదీ కుర్చీ కాపాడేందుకు పేదల ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నారు. మహారాష్ట్ర, బిహార్, బెంగాల్‌లో ఓట్లు తొలగించి ప్రభుత్వాలు ఏర్పాటు చేశారు" అని రేవంత్ ఆరోపించారు.

మొదలైన కుంభమేళా మారిన నాసిక్, త్రయంబకేశ్వర్ రూపురేఖలు

మన దేశంలో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక సమాగమాల్లో ఒకటైన సింహస్థ కుంభమేళా 2027కు మహారాష్ట్రలోని నాసిక్, త్రయంబకేశ్వర్ నగరాలు రెడీ అయ్యాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ మహా వేడుకకు దేశం నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలోనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు.. ఈ రెండు నగరాల రూపురేఖలను శాశ్వతంగా మార్చేలా మహారాష్ట్ర ప్రభుత్వం భారీ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకోసం ఏకంగా రూ.34,732 కోట్లను కేటాయించింది. రోడ్లు, బ్రిడ్జిలు, ఘాట్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రవాణా వ్యవస్థలు, ఆలయాల అభివృద్ధి వంటి పనులతో మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు శరవేగంగా పూర్తి కానున్నాయి.

అక్టోబర్ 31వ తేదీన నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంతో నాసిక్‌త్రయంబకేశ్వర్ సింహస్థ కుంభమేళా ఏర్పాట్లకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. బృహస్పతి సింహరాశిలోకి, సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశించే ప్రత్యేక గ్రహస్థితి ఆధారంగా ఈ కుంభమేళాను నిర్వహిస్తారు. అందుకే దీనికి సింహస్థ కుంభమేళా అనే పేరు వచ్చింది. ఈ పవిత్ర సమయంలో గోదావరి నదిలో స్నానం చేయడం విశేష పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. శనివారం జరిగిన జెండా ఆవిష్కరణ వేడుకతో సింహస్థ కాలం ప్రారంభమైంది. ప్రధాన స్నాన ఘట్టం వచ్చే ఏడాది ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో జరగనుండగా.. సుమారు 12 కోట్ల మంది భక్తులు హాజరవుతారని భావిస్తున్న ఈ కుంభమేళా 2028 జూలై వరకు కొనసాగుతుంది.

దేశంలో ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభమేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్‌తో పాటు త్రయంబకేశ్వర్‌లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్‌లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విషయంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధువులు త్రయంబకేశ్వర్‌లోని కుశావర్త తీర్థం వద్ద.. వైష్ణవ అఖాడాలు నాసిక్‌లోని రామ్‌కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోంది. వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగనున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్‌లో 45, త్రయంబకేశ్వర్‌లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలుగా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించారు.

సిక్కు వ్యతిరేక అల్లర్ల రోజే

ర్యాలీ ఎందుకు?



న్యూఢిల్లీ, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగిన ఇండియా కూటమి ర్యాలీపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇదంతా ఒక రాజకీయ నాటకమని కేంద్రమంత్రి జేపీ నడ్డా అన్నారు. దేశంలో అరాచకం సృష్టించి, ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రకు ప్రతిపక్షాలు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. భారత్ ''బనానా రిపబ్లిక్'' కాదనే విషయాన్ని రాహుల్ గాంధీ గుర్తించాలని అన్నారు. దేశంలో ఇష్టానుసారం అల్లర్లు సృష్టించలేరని వ్యాఖ్యానించారు. రామ్‌లీలా మైదాన్‌లో జరుగుతున్నది ప్రజాస్వామ్య గౌరవం కాదని, ప్రజాస్వామ్యం పేరుతో అరాచాన్ని వ్యాప్తి చేస్తే ఉద్దేశపూర్వక ప్రయత్నమని అన్నారు. పదే పదే తిరస్కరణకు గురైన నాయకులే ఈ రాజకీయ నాటకానికి తెరతీశారని ఎద్దేవా చేశారు.

అబద్ధాలు చెప్పడం, గందరగోళం సృష్టించడం, వీధుల్లో అరాచకం, అశాంతిని ప్రేరేపించడం, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, విదేశీ శక్తుల ఆదేశాల మేరకు ప్రభుత్వాన్ని అస్థిరపరచడం రాహుల్ గాంధీ ఉద్దేశమని నడ్డా ఆరోపించారు. 1984 నవంబర్ 1 సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగిన రోజే ఈ ర్యాలీని రాహుల్ గాంధీ నిర్వహించడం వెనక ఆంతర్యమేంటి? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆ రోజున అమాయక సిక్కుల్ని ఊచకోత కోశారన్నారు. వేలాది మంది కుటుంబాలు నిరాశ్రయులయ్యారని, పెద్ద సంఖ్యలో మహిళలు తమ భర్తల్ని కోల్పోయారని పేర్కొన్నారు. సిక్కు సమాజానికి కాంగ్రెస్, గాంధీ కుటుంబం మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పలేదని ఆరోపించారు. ధన్‌తేరాస్, దీపావళి, ఛత్ పూజ వంటి పండగల సమయంలో చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారుల ఆదాయాన్ని దెబ్బతీయడాన్ని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని నడ్డా అన్నారు. సెంట్రల్ ఢిల్లీలోని చాందినీ చౌక్, సదర్ బజార్, ఖారీ బౌలీ, కరోల్ బాగ్ వంటి మార్కెట్లలో పెద్ద సంఖ్యలో చిన్న వ్యాపారులు ఉన్నారని, ఇలాంటి కార్యక్రమాల వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటోందని అన్నారు.

మీరు అక్కడే ప్రధాని అవ్వండి దేశానికి ఎప్పటికీ కాలేరు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకుడు ప్రేమకు బదులుగా ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. గాంధీ ప్రముఖ రాజకీయ నినాదాలలో ఒకటైన 'మొహబ్బత్ కీ దుకాణ్' నినాదాన్ని కాంగ్రెస్ నాయకత్వంపై దాడిగా మారుస్తూ, "రాహుల్ గారు, మీ ప్రేమ దుకాణంలో మీకు ద్వేషం తప్ప మరేమీ దొరకదు" అని షా అన్నారు.

రాహుల్ గాంధీ చేపట్టిన 'మాక్ పార్లమెంట్'పై అమిత్ షా విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి కావాలనే తన ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి కాంగ్రెస్ నేత ఒక కొత్త రాజకీయ వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నారని ఆయన అన్నారు. "రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారు, అందుకే ఆయన 'మాక్ పార్లమెంట్' ద్వారా ఒక కొత్త దారిని ఎంచుకున్నారు. రాహుల్ గాంధీ, మీరు మీ మాక్ పార్లమెంట్‌లో ప్రధానమంత్రిగా కొనసాగవచ్చు. కానీ, దేశానికి ప్రధానమంత్రి కావాలనే మీ కల మాత్రం ఎప్పటికీ నెరవేరదు" అని అమిత్ షా ఎద్దేవ చేశారు.

అలాగే కాంగ్రెస్ పార్టీకి మరో ఎన్నికల పరాభవం తప్పదని అమిత్ షా జోస్యం చెప్పారు. గత మూడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ కనీసం ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని, రాబోయే ఎన్నికల్లోనూ అదే పరిస్థితి ఎదురవుతుందని పేర్కొన్నారు. మరోసారి ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధం అవ్వండని అమిత్ షా అన్నారు. అలాగే పండుగ సీజన్‌లో ర్యాలీని నిర్వహించవద్దని కోరుతూ.. ఢిల్లీ వ్యాపారులు కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేశారని వచ్చిన వార్తల గురించి కూడా హోంమంత్రి ప్రస్తావించారు. పంజాబ్ రాష్ట్రంలో తమ రాజకీయ ఉనికిని విస్తరించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, ఇందులో భాగంగా, తాము కేవలం ఒక చిన్న మిత్రపక్షంగానే ఉండిపోకుండా సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజల తీర్పును కోరతామని అమిత్ షా స్పష్టం చేశారు. పంజాబ్‌లో బీజేపీ ఎన్నికల ప్రచారంలో డ్రగ్స్ సమస్యను అమిత్ షా ప్రధానాంశంగా తీసుకున్నారు.



కాంగ్రెస్ తెచ్చింది ప్రకృతి కరువు కాదు.. ప్రభుత్వ కరువు

(మొదటి పేజీ తరువాయి)

భాజపాకి ఓటు వేస్తే.. ఈ 13 ఏళ్లలో రాష్ట్రానికి ఏమైనా మేలు జరిగిందా? ప్రధాని మోదీ రాష్ట్రానికి ఒక్క జాతీయ ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు. మెడికల్ కాలేజీ లేదు, జాతీయ విద్యాసంస్థలు లేవు. బడే భాయ్, చోటే భాయ్ కలిసిపోయి రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారు. కాంగ్రెస్, భాజపా తెలంగాణలో కొట్లాడుతున్నట్టు చేస్తారు.. దిల్లీలో కలిసిపోతారు. ఒక్కసారి తప్పుగా ఓటేస్తే.. ఐదేళ్లు బాధపడాల్సి వస్తుంది. యూరియా కోసం చెప్పులు క్యూలో పెట్టే రోజులు మళ్లీ వచ్చాయి. ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుటుంబం దోపిడీ చేస్తోంది'' అని కేటీఆర్ ఆరోపించారు.

కేసీఆర్‌లో కే అంటే కాలువలు, సీ అంటే చెరువులు, ఆర్ అంటే రిజర్వాయర్లు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. అదే కాంగ్రెస్ అంటే కరువు, కాంగ్రెస్ అంటే వలసలు, కాంగ్రెస్ అంటే కన్నీళ్లు అని కేటీఆర్ విమర్శించారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా డైట్ మైదానంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే ఆర్థిక సాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కూడా కలిపి ఎకరానికి

మొత్తం రూ.60 వేల చొప్పున చెల్లించాలని కోరారు. రైతుల పట్ల ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే ఈ మొత్తాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు.

కాళేశ్వరం నీటిని వినియోగించకపోవడం, సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్నది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

కౌలు రైతులకు కూడా రైతులతో సమానంగా రైతుబంధు సాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 21 లక్షల మంది కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కలిపి మొత్తం నాలుగు పంటలకు ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే భూమిలేని నిరుపేద రైతు కూలీలకు 36 నెలల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బకాయిలు రూ.36 వేలు వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతు అంటే ఎవరో తెలుసా? భూమి లేని వ్యక్తి లేదా తక్కువ భూమి ఉండి పక్కవారి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకునే వ్యక్తి. అలాంటి కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని 21 లక్షల మంది కౌలు రైతులకు ప్రేమలేఖలు రాసి, తనకు ఓటు వేస్తే రైతుబంధు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి కౌలు రైతులు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. ఇప్పుడు ఆ హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు.

రైతులతో సమానంగా కౌలు రైతులకు కూడా రైతుబంధు చెల్లించాలని రాష్ట్రంలోని కౌలు రైతుల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎగ్గొట్టిన మూడు విడతలతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కలిపి నాలుగు పంటలకు ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే ఖాతాల్లో జమ చేయాలని అన్నారు.

భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. నెలకు రూ.1,000 చొప్పున ఇస్తామని చెప్పి 36 నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. నెలకు వెయ్యి రూపాయల చొప్పున 36 నెలలకు కలిపి ఒక్కో రైతు కూలీకి రూ.36 వేలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. "36 నెలలు అయిపోయాయి. మరి 36 నెలలకు గాను మీ అందరి చప్పట్ల మధ్యన నేను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా.. వెంటనే రూ.36 వేలు మా రైతు కూలీల ఖాతాల్లో డిపాజిట్ చేయాలి" అని కేటీఆర్ అన్నారు.

రాప్తాడు విద్యార్థినిపై దాడి కేసులో ట్విస్ట్

అనంతపురం, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం స్కూల్లోకి చొరబడిన హేమంత్ అనే యువకుడు చెట్లు నరికే రంపం యంత్రంతో సదరు బాలికపై దారుణంగా దాడికి తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని అక్కడికక్కడే కుప్పకూలడంతో నిందితుడు ఘటన స్థలం నుంచి పరారయ్యాడు. దాడి జరిగినప్పటి నుంచి పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

పోలీసుల గాలింపు క్రమంలో నిందితుడు ఆత్మకూరు అడవుల ప్రాంతంలో దాక్కున్నట్లు పక్కా సమాచారం అందడంతో ప్రత్యేక బలగాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించాయి. సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా పోలీసులకు నిందితుడు ఎదురుపడ్డాడు. ఈ సమయంలో పోలీసులపై దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు హేమంత్‌పై కాల్పులు జరిపినట్లు సమాచారం అందుతోంది. ఈ కాల్పుల్లో నిందితుడికి తీవ్ర గాయాలవ్వడంతో పోలీసులు అతడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు తెలుస్తోంది.



అసలేం జరిగింది?

నిందితుడైన హేమంత్.. ఆత్మకూరు అడవుల్లో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడ గాలింపు చేపట్టారని, అయితే పోలీసులను చూసిన హేమంత్ పారిపోవడానికి ప్రయత్నించాడని, ఆ క్రమంలో పోలీసులు కాల్పులు జరిపినట్లు వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో సీన్ రీ కన్ స్ట్రక్షన్స్ కోసం నిందితుడిని పోలీసులు తీసుకెళ్లారని, ఆ టైమ్‌లో హేమంత్ పారిపోయేందుకు ప్రయత్నించాడని, అప్పుడే కాల్పులు జరిగాయనే కథనాలు కూడా వెలువడుతున్నాయి. ఏది ఏమైనా ఈ విషయంపై పోలీసులు అఫిషియల్‌గా స్టేట్‌మెంట్ ఇచ్చేవరకు.. ఒక క్లారిటీ రాదు.

రాప్తాడు ఘటన నేపథ్యం...

రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గోపిక అనే విద్యార్థినిపై హేమంత్ అత్యంత కిరాతకంగా దాడి చేసిన విషయం విదితమే. చెట్లను నరికే యంత్రంతో పాఠశాల తరగతి గదిలోకి చొరబడి.. విద్యార్థినిపై దాడికి పాల్పడ్డాడు. ఆపడానికి ప్రయత్నించిన ఇంకో అమ్మాయిపై కూడా దాడి చేశాడు.

ఈ దారుణ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆ బాలిక ప్రస్తుతం బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. రెండు సర్జరీలు చేయడం జరిగింది. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగానే ఉందని, రాబోయే 48 గంటలు చాలా కీలకమని వైద్యులు వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ కూడా బాలికను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబంతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు.

కాగా పాఠశాలలో తోటి విద్యార్థుల ముందే జరిగిన ఈ దారుణ ఘటనపై ప్రజాస్వామిక వాదులు, పలువురు రాజకీయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు తప్పించుకునే యత్నం చేయడం, పోలీసుల కాల్పుల్లో గాయపడటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కాల్పుల ఘటనపై పూర్తి వివరాలను పోలీసు ఉన్నతాధికారులు త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

రాబోయే 48 గంటలు కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రస్తుతం బాధిత బాలిక ఐసీయూలో చికిత్స పొందుతోందని, రాబోయే 48 గంటలు చాలా కీలమని చెప్పారు. ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుందని డాక్టర్లు చెప్పారన్నారు. అదేవిధంగా బాలిక త్వరగా కోలుకోవాలని ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని సూచించారు. బాలిక పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని కూడా నారా లోకేశ్ చెప్పారు. అలాగే బాలిక కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని, తన పర్సనల్ ఫోన్ నెంబర్‌ని వాళ్లకి ఇచ్చానని అన్నారు. ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్...

అలాగే ఘటన జరిగిన పాఠశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. దారుణ ఘటన జరిగిన సమయంలో పక్క క్లాసులో,



అదే క్లాసులో ఉన్న విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని తెలిపారు. వారికి ఇప్పటికే కౌన్సెలింగ్ ప్రారంభించామని, దాదాపు ఏడాది పాటు వారికి కౌన్సెలింగ్ అవసరమవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఇలాంటి దారుణ ఘటనలు రిపీట్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని, పాఠశాలల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో బాలికపై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు ఏపీలో ఆడపిల్లల వైపు వక్రదృష్టితో చూస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు.

బాలికకు జరిగిన శస్త్ర చికిత్సలు...

రాప్తాడు ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ప్రస్తుతం బెంగళూరులో వైద్యం కొనసాగుతుంది. బాలికకు శరీర భాగాలు, ముఖంపై జరిగిన గాయాలకు సంబంధించి వైద్యులు ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీలను పూర్తి చేశారు. అలాగే దాడి వల్ల జరిగిన తీవ్ర రక్తస్రావాన్ని డాక్టర్లు విజయవంతంగా అరికట్టారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. దీంతో చిన్నారి ప్రాణాలను కాపాడ్డానికి ప్రయత్నిస్తున్న డాక్టర్లను నారా లోకేశ్ అభినందించారు. డాక్టర్ల బృందందతో పాటు.. వేగంగా స్పందించిన అధికారులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అగ్గువకు ఐడీబీఐ..! నిరుడు

బ్యాంక్ లాభం 10 వేల కోట్లు



కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు రూ. 52,878 కోట్లకు ఐడీబీఐ బ్యాంక్‌ను విక్రయించే ప్రక్రియలో అనేక అనుమానాస్పద అంశాలు ఉన్నాయని బిజినెస్ వరల్డ్ పత్రిక సంచలన కథనాన్ని ప్రచురించింది. మొదట ఫెయిర్‌ఫాక్స్‌తో పాటు మరో సంస్థ సమర్పించిన సీల్డ్ బిడ్లు, రహస్యంగా నిర్ణయించిన కనీస రిజర్వ్ ధర రూ. 94.42 కంటే చాలా తక్కువగా వచ్చాయి. ఫెయిర్‌ఫాక్స్ తొలుత ఒక్కో షేరుకు రూ. 75 మాత్రమే కోట్ చేసింది. దీంతో అధికారులు అసాధారణమైన నిర్ణయం తీసుకున్నారు.

కనీసం రిజర్వ్ ధరను రూ. 75.99కు తగ్గించారు. అయితే ఈ నిర్ణయాన్ని బహిరంగంగానే తీసుకున్నట్లు చూపించారు. ఫెయిర్‌ఫాక్స్‌తో పాటు మరో బిడ్డర్‌ను కొత్తగా బిడ్లు సమర్పించాలని కోరారు. అయితే ఆ రెండో బిడ్డర్ పేరును వెల్లడించలేదు. భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర హోంశాఖ ఆ సంస్థను తర్వాత తిరస్కరించినట్లు సమాచారం. ఈసారి ఫెయిర్‌ఫాక్స్ ఒక్కో షేరుకు రూ. 81 చొప్పున బిడ్ వేసింది. అనంతరం ఇదే తమరి చివరి ఆఫర్ అని, అంగీకరించకపోతే బిడ్డింగ్ నుంచి తప్పుకుంటామని స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వం ఆ బిడ్‌ను అంగీకరించింది. అధిక ఇంధన ధరల కారణంగా కేంద్ర ప్రభుత్వంపై పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాక తగ్గిపోవడం, అంతర్జాతీయ ఇంధన సంక్షోభాల కారణంగా భారత కరెన్సీపై ఒత్తిడి పెరుగడంతో అత్యవసరంగా ఈ విక్రయం చేపట్టాల్సి వచ్చిందంటూ అంతర్గత నోట్‌లో పేర్కొన్నది. ఐడీబీఐ బ్యాంక్ విక్రయానికి సంబంధించిన నిబంధనలు, విలువ నిర్ధారణ పద్ధతిని మార్చడానికి జనరల్ ఫైనాన్షియల్ రూల్స్‌ను ఆధారంగా చూపినట్లు బిజినెస్ వరల్డ్ కథనం పేర్కొన్నది.

ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో గతంలో కార్యదర్శిగా పనిచేసిన సత్యనారాయణ మొహంతి ఈ వ్యవహారంపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. బిడ్లను పరిశీలించి, తెరిచిన తర్వాత ప్రభుత్వం బిడ్డింగ్ నిబంధనలను మార్చితే, కొత్త నిబంధనల ప్రకారం బిడ్లు వేయాలనుకునే ఇతర సంస్థలకు కూడా అవకాశం కల్పించేందుకు మొత్తం ప్రక్రియను మొదటి నుంచి తిరిగి ప్రారంభించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ఐడీబీఐ బ్యాంక్ విక్రయ ప్రక్రియలో కార్యదర్శుల కోర్ గ్రూప్ ఈ విధానాన్ని అనుసరించలేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ ఒప్పందాల్లో పారదర్శకత ఏదీ?: కాంగ్రెస్

ఐడీబీఐ బ్యాంక్ విక్రయంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఒప్పందాల్లో పారదర్శకతపై కాంగ్రెస్ పార్టీ శనివారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 10,000 కోట్ల లాభాన్ని నమోదు చేసిన, చారిత్రక నేపథ్యం ఉన్న సంస్థను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ సంస్థకు విక్రయించడానికి కారణమేంది? అంటూ జైరాం రమేశ్ ప్రశ్నించారు.

ఎల్ఐసీలో స్వతంత్ర డైరెక్టర్‌గా ఉన్న గురుమూర్తి మహాలింగం, ఫెయిర్‌ఫాక్స్ నియంత్రణలో ఉన్న థామస్ కుక్ ఇండియా సంస్థ బోర్డులోనూ ఏకకాలంలో ఏడు నెలలపాటు సభ్యుడిగా కొనసాగారని ఆయన పేర్కొన్నారు. ఈ సమయంలోనే ఎల్ఐసీ తన వద్ద ఉన్న ఐడీబీఐ బ్యాంకులోని 30.24 శాతం వాటాను విక్రయించే ప్రక్రియను ప్రారంభించిందని, అదే సమయంలో ఫెయిర్‌ఫాక్స్ కూడా బ్యాంక్ కొనుగోలు కోసం బిడ్డర్లలో ఒకటిగా ఉన్నదని మీడియా కథనాన్ని ఉటంకిస్తూ తెలిపారు.ప్రభుత్వం మొదట నిర్ణయించిన కనీస ధరకంటే సుమారు రూ. 8,800 కోట్లు తక్కువకు బ్యాంకును విక్రయించడం ఎలా సాధ్యమైంది? ఈ నిర్ణయం తీసుకోవాలని ఎవరు సూచించారు? ఎందుకు తీసుకున్నారు అని అడిగారు. అంతేకాకుండా, ఐడీబీఐ విక్రయ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఫెయిర్‌ఫాక్స్ గ్రూపునకు చెందిన సంస్థల్లో గతంలో ప్రభుత్వ, నియంత్రణ సంస్థల్లో పనిచేసిన పది మంది ఉన్నతాధికారులకు ఉద్యోగాలు ఎలా లభించాయని ప్రశ్నించారు.

అన్ని నిబంధనలు పాటించాం: నిర్మల

ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం చేసిన విమర్శలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ఐడీబీఐ బ్యాంక్ తమకు అప్పగించే సమయానికి దారుణమైన పరిస్థితుల్లో ఉన్నదని ఆమె అన్నారు. వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలు పాటించామని చెప్పారు.

201718లో దివాలా అంచుకు ఐడీబీఐ

201718లో ఐడీబీఐ బ్యాంకు దాదాపు పతనం అంచుకు చేరుకున్నది. ఆ సమయంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు దాదాపు 28 నుంచి 30 శాతానికి చేరుకున్నాయి. ఆర్బీఐ కఠినమైన ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ విధానాన్ని అమలు చేయడంతో బ్యాంక్ కార్యకలాపాలపై తీవ్ర పరిమితులు విధించింది. 2019 జనవరిలో ఎల్ఐసీ రూ. 21,624 కోట్ల పెట్టుబడిని ఐడీబీఐ బ్యాంకులో పెట్టి 51 శాతం నియంత్రణ వాటాను సొంతం చేసుకున్నది.

జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే..



కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, ఓటు హక్కును ప్రమాదంలో పడవేస్తున్న భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై శనివారం ఇండియా కూటమి ప్రతీకాత్మక 'బహిరంగ అభిశంసన' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆయన ఆ పదవి నుంచి దిగాల్సిందేనని మాక్ పార్లమెంట్ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. ఇండియా కూటమి ఎంపీలు, పౌరసమాజాల ప్రతినిధులు, ఓటు తొలగింపునకు గురైన కొంతమంది బాధిత పౌరులు హాజరైన ఈ కార్యక్రమంలో సమావేశ మందిరాన్ని పార్లమెంట్ తరహాలో అమర్చారు.

ర్యాలీకి తరలి రండి

జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ఆదివారం రాజధానిలో పెద్దయెత్తున నిర్వహించే ర్యాలీకి తరలి రావాలని నేతలు సమావేశంలో పిలుపునిచ్చారు. సీఈసీని ట్రోహిగా పేర్కొన్న మల్లికార్జున్ ఖర్గే ఆయనపై తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా ఇచ్చిన ఆదేశాల ప్రకారమే సీఈసీ ఎన్నికల సంఘాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల జాబితా నుంచి అర్హులైన ఓటర్లను అన్యాయంగా తొలగిస్తున్న క్రమంలో సీఈసీపై ప్రజా అభిశంసన నిర్వహించేందుకు ఈ మాక్ పార్లమెంట్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీ స్పీకర్ మీరా కుమార్ తెలిపారు.

ఓట్ల తొలగింపు దళిత, అల్పాదాయ వర్గాలపై దాడి

సర్ ప్రక్రియ దేశంలోని పీడీఏ (వెనుకబడి, దళిత, అల్పసంఖ్యాక) వర్గాలపై ప్రత్యక్ష దాడి అని సమాజ్‌వాది పార్టీ ఎంపీ హరేంద్ర మాలిక్ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓట్లను తొలగించే లక్ష్యంతో దీనిని అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

యూడీపీలో మిగిలిన ఒక్క ఎమ్మెల్యే అయిన అధ్యక్షుడు.. మంత్రి పదవికి రాజీనామా



షిల్లాంగ్: మేఘాలయ రాజకీయాల్లో 'కింగ్‌మేకర్'గా వ్యవహరించిన యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ) ప్రస్తుతం తీవ్రమైన ఉనికి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేల్లో 11 మంది బీజేపీ, ఎన్పీపీలో చేరారు. దీంతో మిగిలిన ఒక్కగానొక్క ఎమ్మెల్యే, యూడీపీ అధ్యక్షుడైన మెత్బా లింగ్డో శనివారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సీఎం కాన్రాడ్ కె. సంగ్మా నేతృత్వంలోని మేఘాలయ డెమోక్రటిక్ అలయన్స్ (ఎండీఏ) ప్రభుత్వంలో ఏడాదికి పైగా మంత్రిగా ఆయన పనిచేశారు. మేఘాలయ అసెంబ్లీకి మాజీ స్పీకర్‌గా కూడా పనిచేసిన మెత్బా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు మారినందునే తాను రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, యూడీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడటంతో ఆ పార్టీలో మిగిలిన ఏకైక ఎమ్మెల్యేగా నేను మాత్రమే ఉన్నాను. ఈ పరిస్థితుల్లో ఎండీఏ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగడం సాధ్యం కాదని భావించి, ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మాకు నా రాజీనామాను సమర్పించా. నా రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇది పార్టీ తీసుకున్న మొదటి నిర్ణయం మాత్రమే. రాబోయే రోజుల్లో మరిన్ని నిర్ణయాలు ఉంటాయి' అని ఆయన అన్నారు.

కాగా, 2023లో జరిగిన మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో యూడీపీ 12 స్థానాలను గెలుచుకున్నది. ఖాసీ జైంతియా హిల్స్ ప్రాంతంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే మూడేళ్లు తిరగకముందే ఆ పార్టీ నుంచి శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో నిష్క్రమించారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరగా, మరో ముగ్గురు ఎన్పీపీలో చేరారు.

మరోవైపు ఈ పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీలో యూడీపీ నుంచి కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే మిగిలి ఉన్న ఆ పార్టీ అధ్యక్షుడైన మెత్బా లింగ్డో, మంత్రిగా కొనసాగడం సరికాదని భావించారు. ఈ నేపథ్యంలో శనివారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. పార్టీ తీసుకోబోయే మరికొన్ని నిర్ణయాలకు ఇది నాంది కానున్నదని ఆయన సూచించారు.

పోలీస్ స్టేషన్‌లో మహిళపై అత్యాచారం.. కానిస్టేబుల్ అరెస్ట్,

రాంచి: పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఒక మహిళపై కానిస్టేబుల్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో అతడిని అరెస్ట్ చేశారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ అధికారి సహా ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేశారు. జార్ఖండ్‌లోని సెరైకేలాఖర్స్వాన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 29 రాత్రి వేళ గంహారియా పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త తనను కొడతాడన్న భయంతో భార్య ఇంటి నుంచి బయటకు వచ్చింది. పొరుగువారి ఇంటికి వెళ్ళిన ఆ మహిళ తన మొబైల్ ఫోన్ నుంచి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో ఒక పీసీఆర్ వ్యాన్ అక్కడకు చేరుకున్నది. ఆ రాత్రి వేళ మహిళను గంహారియా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విశ్రాంతి కోసం పోలీస్ స్టేషన్‌లోని ఒక గదిని ఆమెకు ఏర్పాటు చేశారు.

కాగా, ఆ పోలీస్ స్టేషన్‌లో వైర్‌లెస్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ ఆ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు జరుపాలని సెరైకెలా సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌ను ఎస్పీ ఆదేశించారు. ఎస్‌డీపీవో నివేదిక ఆధారంగా నిందితుడైన కానిస్టేబుల్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అతడిని పోలీసులు అరెస్ట్ చేయగా, కోర్టు జ్యుడిషియల్ కస్టడీ విధించింది.

మరోవైపు సంఘటనా సమయంలో నిందితుడు ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరీక్ష కోసం రాంచీలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి వాటిని పంపారు. అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్య ప్రవర్తన, క్రమశిక్షణారాహిత్యం వంటి ఆరోపణలపై గహ్మరియా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారిని, మరో నలుగురు పోలీస్ సిబ్బందిని కూడా ఎస్పీ సస్పెండ్ చేశారు.

సంసిద్ధత.. స్వావలంబన..

వాయుసేన నూతన చీఫ్

వాయుసేనకు మంజూరైన ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్యను పునరుద్ధరించడం, ఆయుధ వ్యవస్థల పరంగా స్వావలంబనను సాధించడం, త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం తన ప్రాధాన్య అంశాలని ఐఏఎఫ్ నూతన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ వెల్లడించారు. దేశ సేవ విషయంలో వాయుసేన ఎల్లప్పుడూ అప్రమత్తంగా, సిద్ధంగా, దృఢ నిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. 29వ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా శనివారం అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదివారం ఆయన ప్రసంగిస్తూ.. 'వాయు' అనే పేరుతో తాను ప్రధానంగా దృష్టి సారించనున్న అంశాలను వివరించారు. అప్రమత్తత, కార్యాచరణ సంసిద్ధత (విజిలెన్స్ అండ్ ఆపరేషనల్ రెడీనెస్), స్వావలంబన (ఆత్మనిర్భరత), వ్యూహాత్మక నూతనత్వం (యుక్తి), త్రివిధ దళాల సమష్టి కృషి (యూనిటీ)గా వాటిలో ఉన్నట్లు వెల్లడించారు. భద్రత సవాల్‌గా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో.. ప్రతి స్క్వాడ్రన్, రాడార్, గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు ప్రతి ఒక్క సైనికుడు క్షణకాలంలో స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.





జమ్ము కశ్మీర్ సీఎంపై 24 మంది ఎమ్మెల్యేల అసంతృప్తి

జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇటీవల చేపట్టిన క్యాబినెట్ విస్తరణపై పాలక పక్షం నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన 24 మంది ఎమ్మెల్యేల్లో అసంతృప్తి వ్యక్తమైంది. వీరిలో 18 మంది ఎమ్మెల్యేలు శుక్రవారం లోలబ్ ఎమ్మెల్యే ఖైసర్ జంషీద్ ఇంట్లో సమావేశం కాగా ఆరుగురు ఎమ్మెల్యేలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సీఎం సలహాదారు నసిర్ సోగామి, నలుగురు కొత్త మంత్రులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. క్యాబినెట్‌లోనూ భారీ మార్పులు చేపట్టాలని కోరారు. సోగామి పార్టీ విధుల్లో జోక్యం చేసుకొంటూ నాయకత్వాన్ని తప్పు దోవ పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. తమ డిమాండ్లపై పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాను, సీఎం ఒమర్ అబ్దుల్లాను కలవాలని వారు నిర్ణయించుకొన్నారు. తాము పార్టీని వీడబోమని ప్రతిజ్ఞ చేశారు. కొందరు పార్టీ అంతర్గత పనితీరును బలహీనపరుస్తున్నారని అసంతృప్త ఎమ్మెల్యేలు విమర్శించారు.

జర్నలిస్ట్‌ను పెండ్లాడిన ఒమర్

పాత్రికేయురాలు నిధీ రాజ్‌దాన్‌ను తాను పెండ్లి చేసుకొన్నట్లు జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా శనివారం ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. ఆమెతో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'నిన్న కొత్త ప్రయాణం ప్రారంభమైంది' అని పేర్కొన్నారు.

ఈ నెలలోనూ ఎండలెక్కువే..!




దేశంలో చలి తీవ్రత పెరగాల్సిన నవంబర్‌లోనూ ఎండలు మండిపోనున్నాయి. దేశంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ)వెల్లడించింది. హిమాలయ పర్వత పాద ప్రాంతాల్లో మాత్రం సాధారణ లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తన నెలవారీ నివేదికలో తెలిపింది. అయితే మధ్య, తూర్పు భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. నవంబర్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. మధ్య, వాయవ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా నవంబర్‌లో దీర్ఘకాలిక సగటు వర్షపాతం (ఎల్‌పీఏ)లో 77 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు పసిఫిక్ మహా సముద్రంలో ప్రస్తుతం అత్యంత బలమైన ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లోనూ ఇవి కొనసాగవచ్చని వాతావరణ సమూనాలు సూచిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు మరో తుపాను ముప్పు


బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడబోతున్నది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం ఆరు గంటల్లో వాయు గుండంగా, 24 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. దీనికి 'మురాసు' అనే పేరు పెట్టనున్నారు. నవంబర్ 3న తెల్లవారుజామున ఏపీ తీరాన్ని తాకే అవకాశం ఉంది.

ఉజ్జయినిలో పెను విషాదం.. విషవాయువు పీల్చి నలుగురు హోటల్ కార్మికులు మృతి



మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విషవాయువును పీల్చి నలుగురు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. దేవాస్ రోడ్డులోని శ్రీ గంగా హోటల్‌లో శనివారం రాత్రి భూగర్భ వ్యర్థాల గదిని శుభ్రం చేస్తుండగా విష వాయువులను పీల్చి నలుగురు హోటల్ కార్మికులు మరణించారు. వారిని రక్షించడానికి ప్రయత్నించిన మరో ఇద్దరు కూడా అస్వస్థతకు గురై దవాఖానలో చేరారు. రాత్రి 10.30 గంటల సమయంలో హోటల్ మిఠాయిలు, పాల ఉత్పత్తుల విభాగాల నుంచి వచ్చే మిగిలిపోయిన ఆహారం, ఇతర వ్యర్థాలను సేకరించే గదిలో శుభ్రత పనులు చేపట్టారు. ఈ క్రమంలో కొందరు సిబ్బంది లోపలికి వెళ్లగా విషవాయువు ప్రభావంతో కుప్పకూలిపోయారు. వారిని రక్షించేందుకు వెళ్లిన ఇతరులు కూడా అస్వస్థతకు గురయ్యారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అస్వస్థతకు గురైన వారిని హాస్పిటల్‌కు తరలించారు. మృతులను ఉజ్జయినికి చెందిన కమలేశ్, నితిన్, వహీద్, రాజస్థాన్‌లోని ఝాలావర్‌కు చెందిన మనోజ్ మీనాగా గుర్తించారు. విద్యుత్ కట్టర్‌తో గదిలోని కొంత భాగాన్ని తొలగించి బాధితులను బయటకు తీశారు. పోలీసులు వెంటనే సీపీఆర్ చేసినప్పటికీ నలుగురిని కాపాడలేకపోయారు. గ్యాస్ లీకేజీ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ఉజ్జయిని ఎస్పీ ప్రదీప్ శర్మ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





ఆచి తూచి 'రిజర్వ్' అడుగు!

నిత్యం చోటుచేసుకునే జాతీయ, అంతర్జాతీయ పరిణామాలూ, ప్రకృతి వైపరీత్యాలూ, వాటి పర్యవసానంగా ఏర్పడగల ఆర్థిక సంక్షోభాలపై దృష్టి పెట్టడమే, కలత పడటమే... అందుకు విరుగుడు ఆలోచించటమే రిజర్వ్ బ్యాంకు అసలు పని. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న ఆర్థికరంగ నిపుణులు రిజర్వ్ బ్యాంకు రెపో రేటు పెంచకతప్పదని అంచనా వేస్తున్నారు.

నిజానికి ఆ విషయంలో కొంత ఆలస్యం అయిందన్నది కూడా వారి విశ్లేషణ. ఏమైతేనేం...రెపో రేటును పావు శాతం పెంచుతూ బ్యాంకు ద్రవ్య విధాన సంఘం(ఎంపీసీ) భేటీ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు బాగా పెరుగుతాయి. మధ్యతరగతి జీవులు ఈఎంఐలకు అధికంగా చెల్లించకతప్పదు. మూడేళ్ల క్రితం రెపో రేటు పెంచాక ఇదే మొదటి పెంపు. ఇన్నాళ్లూ రెపో రేటులో ఎలాంటి మార్పు లేకుండా కొనసాగించటం... అటుపై కొంచెం కొంచెం తగ్గించుకుంటూ రావటమే అందరూ చూశారు.

మొత్తానికి వడ్డీ రేటు 5.25 శాతం దగ్గర స్థిరపడింది. పావు శాతం పెంచటంతో ఇప్పుడది 5.50 శాతానికి చేరింది. కానీ ఇదింకా పెరుగుతుందన్న సంకేతాలిచ్చింది. మూడేళ్ల తటస్థంనుంచి 'క్రమానుగత కఠిన విధానం' దిశగా కదులుతున్నట్టు తెలిపింది. దసరా పండుగ సంరంభం సమీపిస్తుండగా తీసుకున్న ఈ నిర్ణయం సహజంగానే వినియోగదారుల కొనుగోలుశక్తిపై ప్రభావం చూపుతుంది. దాని తీవ్రత మరీ ఎక్కువ ఉండరాదని పావు శాతం పెంపునకు పరిమితమైంది.

డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని దేశాల ఆర్థికవ్యవస్థలనూ తలకిందులు చేస్తున్నాయి. విచక్షణారహితంగా విధిస్తున్న అదనపు సుంకాలు మనతో సహా ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ముడి చమురు ధరలు ఆకాశాన్నంటడానికి దారితీసిన పశ్చిమాసియా సంక్షోభం కూడా ఆయన పుణ్యమే. నేనున్నానంటూ సూపర్ ఎల్ నినో కూడా ఇప్పుడే వచ్చిపడింది. సాగురంగాన్ని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది.

వీటన్నిటివల్లా కనుచూపు మేరలో ఆశాజనకమైన పరిస్థితుల జాడ ఉండబోదని అందరికీ తెలుస్తూనే ఉంది. ఆహారధాన్యాల ధరలు అలా పైపైకి పోవటమే తప్ప కిందికి దిగొస్తున్న దాఖలా లేదు. రూపాయి పతనం ఎన్నడూ లేనంతగా ఉంది. ద్రవ్యోల్బణం పెరగటంతో నిజ వేతనాలు గణనీయంగా పడిపోయాయి. మార్కెట్‌కి వెళ్లడం పాపం... జేబు ఖాళీ అవుతోంది. మధ్యతరగతి ఆదాయాలు పడిపోతుంటే... నిరుద్యోగ భూతం భయపెడుతోంది.

స్టాక్ మార్కెట్లు సరేసరి. గత తొమ్మిది నెలల్లో విదేశీ సంస్థాగత మదుపుదార్లు 4 లక్షల కోట్ల రూపాయలుపైగా వెనక్కు తీసుకున్నారని అంచనా. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను దాటి 7.8 శాతానికి గెంతడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతర్జాతీయంగా సంక్షోభం ఉన్నా మన ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటమే కాదు...మెరుగైన దోవన వెళ్తున్నదని కేంద్రం ప్రకటించింది. మొన్న ఆగస్టుకు ద్రవ్యోల్బణం 4.82 శాతం ఉన్నదని లెక్కేశారు.

మరి అప్పుడే రెపో రేటు పెంచాల్సివుండగా ఎందుకు ఆగినట్టని ఆర్థిక రంగ నిపుణులు వేస్తున్న ప్రశ్న హేతుబద్ధమైనదే. పరిస్థితులు బాగులేవన్నది నిజమే అయినా... ఆగస్టునాటికీ, ఇప్పటికీ వచ్చిన గణనీయమైన మార్పేమీ లేదు. సరఫరాకు సంబంధించిన ఒత్తిళ్లు లేదా డిమాండ్ పరమైన ఒత్తిళ్లు ఉన్నప్పుడే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం ఆ రెండూ లేవు. అయినా రేటు పెంచటమంటే ముందు జాగ్రత్త అనుకోవాలి.

వృద్ధి రేటు లెక్క సరికాదని విభేదించినవారు గణనీయంగానే ఉన్నారు. ఆ మాటెలావున్నా 7.8 శాతం వృద్ధి రేటు అనేది నిర్ఛయంగా రెపో రేటు పెంచటానికి ఏ సెంట్రల్ బ్యాంకుకైనా అనువైనది. అది నేలచూపులు చూస్తుంటే పెంచితే అన్ని రకాల రుణాలపైనా వడ్డీ రేట్లు పెరిగి జనం మరింత కుంగుతారు. ఇలా బాగున్న వాతావరణమే పెంపుదలకు అనుకూలమని బ్యాంక్ భావించటంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తుందా లేదా అన్నది చెప్పలేం. అదనపు లిక్విడిటీని అదుపు చేయటంద్వారా అది సాధ్యమేనని ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు భావించారు. చూద్దాం... ఏమవుతుందో!



ఏ ప్రజాస్వామ్యమూ ఉండదు

కచ్చితమైన ఓటర్ల జాబితా లేకపోతే ఏ ప్రజాస్వామ్యమూ ఉండదు. మరణించిన ఓటర్లను క్రమం తప్పకుండా జాబితా నుంచి తొలగించాలి. నకిలీ పేర్లను ఏరేయాలి. వలస వెళ్లినవారి తాజా వివరాలను పొందుపరచాలి. అనర్హులను తీసేయాలి. దీనిపై ఎలాంటి భిన్నాభిప్రాయాలు ఉండవు. అదే సమయంలో అర్హుడైన ప్రతి పౌరుడూ జాబితాలో ఉండాలి. తప్పగా కొందరిని చేర్చడం లేదా మినహాయించడం ఓటర్ల జాబితా విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ఈ సత్యాన్ని 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో అన్ని ఎన్నికల సంఘాలూ అర్థం చేసుకున్నాయి. ఓటర్ల జాబితా పవిత్రతను కాపాడటం రాజ్యాంగబద్ధమైన బాధ్యత. మొదటినుంచీ ప్రతి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ దీనికి అనుగుణంగానే పనిచేశారు. అందుకే సార్వత్రిక వయోజన ఓటుహక్కుకు మన్నన దక్కింది. అయితే, ఓటర్ల జాబితా ఎల్లప్పుడూ తప్పులు లేకుండా ఉంటుందనీ, దాదాపు వంద కోట్ల జనాభాతో కూడిన డేటాబేస్‌లో అసలు పొరపాట్లే జరగవని చెప్పలేం. అయితే, వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత 'సర్' కసరత్తు ప్రారంభమైనప్పటి నుంచీ నేను ఒకటే అడుగుతున్నాను... దశాబ్దాలుగా పనిచేస్తున్న వ్యవస్థను అకస్మాత్తుగా ఎందుకు పక్కన పడేయాల్సి వచ్చింది?



ఓటర్ల జాబితాను కంప్యూటరీకరించిన తర్వాత నుంచి అప్పటికే ఉన్న లిస్టును పునాదిగా తీసుకుని కొత్త ఓటర్లను చేరుస్తున్నారు. మరణించినవారి పేర్లను, నకిలీ పేర్లను తొలగిస్తున్నారు. ఓటర్లు నివాసాలు మారినప్పుడు, ఆ మార్పులను నమోదు చేస్తున్నారు. అభ్యంతరాలను ఆహ్వానిస్తున్నారు. బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని ధ్రువీకరిస్తారు. ఈఆర్‌వోలు శాసనపరమైన నిర్ణయాలు తీసుకుంటారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటాయి. ఇది సాధారణ ప్రక్రియ కాదు. తరతరాలుగా ఓటర్ల జాబితాను నిర్వహించిన వ్యవస్థ ఇది. అయితే జాబితాల సవరణకు ప్రత్యేకమైన కసరత్తు అవసరమయ్యే పరిస్థితులు కచ్చితంగా ఏర్పడవచ్చు. ఎన్నికల కమిషన్‌కు ఇటువంటి కసరత్తును చేపట్టే అధికారం ఉందని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. కానీ చట్టబద్ధమైన అధికారం ఉండటమనేది చర్చకు ఆరంభం మాత్రమే, వ్యవహారం అక్కడితో ముగియదు. కొన్ని నెలల క్రితమే మార్పుచేర్పులు జరిగి, దాని ఆధారంగా ఎన్నికలు జరిగిన ఓటర్ల జాబితా ఏమైంది? ఆ జాబితా ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకోగలిగినప్పుడు లక్షలాది మంది ఓటర్లు తమను తాము మళ్లీ నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?

లోతుగా విచారించడం మంచిది

ఓటర్ల వలసలు, పట్టణీకరణ, బోగస్ ఓటర్ల నమోదు వల్లనే ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని ఎన్నికల కమిషన్ చెబుతోంది. అలాగే భారత పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు అయ్యేట్లు చూసుకోవడానికి కూడా 'సర్'ను చేపట్టామని వివరిస్తోంది. ఈ కారణాలేమీ కొత్తవేం కావు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రజలు ఒక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. సహజంగానే కొందరు పౌరులు మరణిస్తారు, ఇళ్లు మారతారు, ఏటా లక్షలాదిమందికి 18 సంవత్సరాలు నిండుతాయి. నకిలీలు తలెత్తుతారు. అటువంటి సమస్యలను నిరంతరం ఎదుర్కొని, పరిష్కరించడానికే ఎన్నికల యంత్రాంగాన్ని సృష్టించారు. ఎన్నికల అధికారులు 30, 40 లేదా 70 సంవత్సరాల్లో ఓపికగా సాధించినదాన్ని ఇప్పుడు అకస్మాత్తుగా మూడు నెలల్లో పునర్నిర్మించడం సాధ్యం కాదు. ప్రజా పాలనలో మంత్రదండాలేమీ ఉండవు. ఏవైనా ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఓటర్లు నమోదైనట్లు కనిపిస్తే, వాటిని లోతుగా విచారించాలి. సాంకేతికత బోగస్ ఓటర్లను సూచిస్తే, దాన్ని వెంటనే ధ్రువీకరించుకోవాలి. ఏదైనా అనుమానాస్పద చిరునామాలో వందలాది ఓటర్లు కనిపిస్తే, దాన్ని తనిఖీ చేయాలి. విదేశీ పౌరులు మన ఓటర్ల జాబితాలోకి చొరబడుతున్నారని ఆరోపణలు వస్తే, వాటిని విచారించాలి. నిజానిజాలేమిలో ఈఆర్‌వో ధ్రువీకరించాలి. నోటీసు జారీ చేయాలి. తప్పులు సరిదిద్దడానికి సక్రమ ప్రక్రియను అనుసరించాలి. కేవలం అనుమానం ఆధారంగా తీర్పు ఇవ్వరాదు.

ఇక్కడ తెలంగాణ అనుభవాన్ని ప్రస్తావించాలి. నిజమైన ఓటర్లను తొలగించాలనే అభ్యర్థనతో ముందుగానే నింపిన ఫారం 7 దరఖాస్తులను పంపారనే కథనాలు వచ్చాయి. ఆవి రాష్ట్రవ్యాప్త పరిశీలనకు ఆదేశించేలా ప్రధాన ఎన్నికల అధికారిని ప్రేరేపించాయి. ఒక కేసులో నకిలీలుగా పేర్కొన్న మొత్తం ముప్పై మంది ఓటర్లు నిజమైన నివాసితులని తేలిన తర్వాత ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఒక ఎంట్రీ తప్పంటూ పౌరుడు సంతకం చేసిన ప్రకటనే ఫారం 7. అంతే తప్ప ఇది సామూహికంగా ఓటు హక్కు తొలగింపునకు సాధనం కాదు. అనర్హుల పేర్లను తొలగించడానికి ఉద్దేశించిన వ్యవస్థ అర్హులను తొలగించడానికి జరిగే ప్రయత్నాలను గట్టిగా నిరోధించగలగాలి. ప్రతి అభ్యంతరాన్నీ పరిశీలించాలి. ఓటరుకు నోటీసు జారీ చేసి, విచారణ జరపాలి. ఓటర్ల జాబితాకు సంబంధించి తప్పుడు డిక్లరేషన్ ఇవ్వడం ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 31 ప్రకారం నేరం. ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దడానికి ఉద్దేశించిన యంత్రాంగం, ఆ జాబితాలలోని పేర్లను తొలగించే సాధనంగా మారకూడదు. బోగస్ ఓటర్లను తొలగించే పేరుతో అందరు ఓటర్లను బోనులో నిలబెట్టడం సరికాదు. 'సర్' గురించి నన్ను ఎక్కువగా కలవరపెట్టిన విషయం ఇదే.

పౌరుడికి, ఎన్నికల ప్రాధికార సంస్థకూ మధ్య ఉండే సంబంధం తలకిందులైనట్లు కనిపిస్తోంది. ఒక వ్యక్తి పది ఇరవై ఏళ్లుగా ఓటరుగా నమోదు చేసుకుని ఉండవచ్చు, పదేపదే ఓటు వేసి ఉండవచ్చు, ఎన్నికల సంఘం స్వయంగా జారీ చేసిన ఓటరు ఫోటో గుర్తింపు కార్డునూ కలిగి ఉండవచ్చు. అయినా అతను పాత జాబితాతో తనను తాను మళ్లీ తనిఖీ చేసుకోవాలని ఆదేశించడం సరికాదు. ఉదాహరణకు 2008లో పద్దెనిమిదేళ్లు నిండిన యువకుణ్ణి తీసుకోండి. అతను 2009 నుంచి ప్రతి సాధారణ ఎన్నికలలో ఓటు వేశాడు. అతని పేరు 2003 జాబితాలో ఉండదు. అయినప్పటికీ అతను ఇప్పుడు ఓటర్ల జాబితాలోని తన తల్లిదండ్రుల వివరాల ద్వారా తనను తాను ధ్రువీకరించుకోవాల్సి వస్తుంది. అతని తల్లిదండ్రులు ఇప్పటికే మరణించి ఉన్నా, వారి పేర్లు తప్పుగా నమోదై ఉన్నా, లేదా వారి గ్రామంలోని పాత ఓటర్ల జాబితా దొరక్కపోయినా, తాను అసలైన ఓటరునని నిరూపించుకోవాల్సిన భారం అతనిపైనే పడుతుంది తప్ప తనను నమోదు చేసిన వ్యవస్థపై కాదు. ఏదిఏమైనా తాజా ఎన్నికలకు ముందున్న ఓటర్ల జాబితాకు కచ్చితంగా విలువ ఉండాలి.

ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలు...

'సర్' పేరుతో 13కోట్లకు పైగా పేర్లను ముసాయిదా జాబితా నుంచే మినహాయించడం ఆందోళనకరం. ముసాయిదా జాబితా నుంచి ప్రతి తొలగింపూ అంతిమం కాదు. నిజమైన ఓటర్లు అప్పీళ్ల ద్వారా తిరిగి ఓటరు జాబితాలోకి రావచ్చు. కానీ ఈ స్థాయి మినహాయింపులను సాధారణ పొరపాట్లుగా పరిగణించలేము. సర్‌కి ముందు, తర్వాత జాబితాలను సరిపోల్చడానికి, అదృశ్యమైన అర్హులైన ఓటర్లను గుర్తించి వారిని తిరిగి జాబితాలోకి తీసుకురావడానికి ఎన్నికల సంఘం ఇప్పుడు తన యంత్రాంగాన్ని పురమాయించడం స్వాగతించాల్సిన చర్యే. కానీ ఇక్కడ ఒక స్పష్టమైన ప్రశ్న తలెత్తుతోంది. నిజమైన ఓటర్లను పునరుద్ధరించడానికి మునుపటి జాబితాతో పోల్చి చూడటం ఇప్పుడు అవసరమైతే, అదే జాబితాను మొదటి నుంచి ప్రాథమిక డేటాగా ఎందుకు పరిగణించలేదు?

కోట్ల మంది ఓటర్లను ప్రభావితం చేసే 'సర్' గురించి ఎన్నికల సంఘం లోపల నిర్ణయాలు ఎలా తీసుకొన్నారు? రాజ్యాంగం ఏక వ్యక్తి కార్యాలయాన్ని కాకుండా ఎన్నికల సంఘాన్ని సృష్టించింది. ఇది బహుళ సభ్యుల సంస్థగా మారిన తర్వాత, దాని నిర్ణయాలు సామూహికంగా జరగాలి. ఎన్నికల సంఘం ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవాలి, అది కుదరనప్పుడు మెజారిటీ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని చట్టమే నిర్దేశిస్తోంది. కమిషనర్లు కీలకమైన అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారనే వార్తలు నిజమే అయితే, వాటిని కేవలం అంతర్గత విభేదాలుగా కొట్టివేయలేము. ఎన్నికల సంఘం పేరుతో ఒక చర్య తీసుకున్నప్పుడు, అది నిజంగానే సంఘ సభ్యుల ఆమోదంతో జరిగిందా లేదా అని తెలుసుకునే హక్కు పౌరులకు ఉంది. ఓటర్లను గుర్తించడానికి, దరఖాస్తులను ప్రాసెస్ చేయడానికి, వ్యత్యాసాలను గుర్తించడానికి సాంకేతికతను ఉపయోగిస్తున్నా, అంతిమ నిర్ణయానికి చట్టబద్ధమైన అధికారం గల వ్యక్తులే బాధ్యత వహించాలి.

నమ్మకం పోగొట్టుకోవద్దు

ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ ప్రాధికార సంస్థ. దాని బలం కేవలం 324వ రాజ్యాంగ అధికరణ నుంచి, దాని విస్తృత యంత్రాంగం లేదా ఆదేశాలు జారీ చేసే శక్తి నుంచి రాదు. ప్రజల నమ్మకం నుంచి వస్తుంది. విశ్వాసాన్ని నిర్మించడానికి సంవత్సరాలు పడుతుంది. కానీ, నిర్ణయాల్లో సహేతుకత లేకపోతే అది చాలా త్వరగా అదృశ్యమవుతుంది. కాబట్టి ఇప్పుడు తీసుకోవాల్సిన చర్యలేంటో స్పష్టంగానే కనపడుతున్నాయి. ఓటర్ల జాబితా సవరణను సమగ్రంగా, నిరంతరం చేపట్టాలి. 18 ఏళ్ల యువతను క్రమం తప్పకుండా నమోదు చేయాలి. ఇంటింటికీ తిరిగి తనిఖీలు నిర్వహించాలి. నకిలీలు, ఇతర తప్పులను గుర్తించడానికి సాంకేతికతను ఉపయోగించాలి. అర్హత లేని ఎంట్రీల గురించిన ఫిర్యాదులను విచారించాలి. తొలగించే ముందు నోటీసు ఇవ్వాలి. ఎన్నికల కమిషన్‌లో నిజంగా సమష్టి నిర్ణయాలు తీసుకోవాలి. సంప్రదాయ పద్ధతుల నుంచి పక్కకు తొలగితే, దానికి కారణాలను బహిరంగంగా వివరించాలి. పరిస్థితిని చక్కదిద్దడానికి మంత్రదండాలేమీ లేవు. ఉన్నదల్లా ప్రజల నమ్మకమే. దాన్ని పోగొట్టుకోరాదు.

ఒకప్పుడు ఆకాశంలో స్వేచ్ఛగా

ఒకప్పుడు ఆకాశంలో స్వేచ్ఛగా గుంపులుగా ఎగిరిన రాబందులు అంతరించిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. పశువుల కళేబరాలను తిని పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచే ఈ పక్షులు ప్రకృతి వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తాయి. ఇటీవలి కాలంలో హైటెన్షన్ విద్యుత్ తీగల కారణంగా మరింత ఎక్కువగా అవి మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో రాబందుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు కొంతవరకు ఆశాజనకంగానే ఉన్నా, వాటి ఉనికికి ఇంకా సవాళ్లు తప్పడంలేదు.ఎత్తులో ఉండే హైటెన్షన్ విద్యుత్ తీగలు రాబందుల పాలిట ఉరితాళ్లుగా మారుతున్నాయి. అవి ఆహారం కోసం ఎగురుతూ కరెంటు తీగలకు తాకి విద్యుదాఘాతంతో చనిపోతున్నాయి. దేహ్రాదూన్ సమీపంలోని సుధోవాలా ప్రాంతంలో జంతు కళేబరాల డంప్ యార్డ్ దగ్గర 2011-14 మధ్య అయిదు జాతులకు చెందిన సుమారు 743 రాబందులు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయాయి. దాంతో ఆ యార్డును 2.4 కిలోమీటర్ల దూరానికి తరలించడంతో ఈ తరహా మరణాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. అంతేకాకుండా బ్లాక్‌కైట్, క్రెస్టెడ్ సర్పెంట్ ఈగల్ వంటి ఇతర జాతి పక్షులు కూడా రావడం ప్రారంభించాయి.



సంరక్షణలో సత్ఫలితాలు...

ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే రాబందులు అంతరించిపోతున్న వేళ, వాటి సంతతిని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2006 నుంచి ప్రత్యేక సంరక్షణ చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా ఎనిమిది సంరక్షణ, క్యాప్టివ్ బ్రీడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆలోచన మంచి ఫలితాలనే అందిస్తోంది. ఇందులో భాగంగా రాబందుల పునరావాసం, అడవుల్లోకి తిరిగి ప్రవేశపెట్టడం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. క్యాప్టివ్ బ్రీడింగ్ ద్వారా దేశంలో ఇప్పటి వరకు సుమారు 800 రాబందులు జన్మించాయి. అందులో దాదాపు 110 పక్షులను అడవుల్లో వదిలేశారు. ఈ విధానంలోనే దేశంలోని పలు కేంద్రాల్లో రాబందుల సంరక్షణ, సంతానోత్పత్తి వంటివి కొనసాగుతున్నాయి. అలాగే రాబందు భద్రతా ప్రాంతాలను గుర్తించి స్థానికులకు అవగాహన కల్పించడంతో పాటు వాటి ఆవాసం, ఆహారం కోసం చర్యలు చేపడుతున్నారు. మరికొన్ని చోట్ల రాబందు ఆహార కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటికి డైక్లోఫినాక్ రహిత ఆహారాన్ని అందిస్తున్నారు. హరియాణాలోని పింజోర్ జటాయు రాబందుల సంరక్షణ కేంద్రంలో క్యాప్టివ్ బ్రీడింగ్ ద్వారా 2024లో పుట్టిన ఒక రకం రాబందుకు జీపీఎస్‌ను అమర్చి అడవుల్లో వదిలేశారు. అది గతనెల ఒకటో తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ, ఇతర రాబందులను కలుస్తూ సుమారు 1300 కిలోమీటర్లు చుట్టి వచ్చింది. కాబట్టి, సంరక్షణ కేంద్రాల్లో పుట్టిన రాబందులు బయటి వాటితోనూ సులభంగా కలిసిపోతున్నాయని పరిశోధకులు అంచనా వేశారు. ఒకప్పుడు దేశమంతటా విస్తారంగా కనిపించిన రాబందులు ఇప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. చాలాచోట్ల అవి అసలు కనిపించట్లేదు. తెలుగు రాష్ట్రాల్లోనూ వాటి సహజ ఆవాసాలు క్రమంగా క్షీణిస్తున్నాయి. తెలంగాణలోని కుమురం భీం, ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు, నల్లమల అడవుల్లో మాత్రమే రాబందులు తిరుగుతున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో రాబందుల ఆహార వనరులను రక్షించడం, విషపూరిత ఔషధాల వినియోగాన్ని నియంత్రించడం, విద్యుత్ లైన్లను సురక్షితంగా ఏర్పాటు చేయడం అత్యావశ్యకం. లేకపోతే మిగిలిన కొద్దిపాటి రాబందుల జనాభా కూడా క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇటీవల తమిళనాడులో ఈజిప్షియన్ రాబందు జాతి పూర్తిగా అంతరించిపోయినట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఒకప్పుడు 4 కోట్లుగా ఉన్న రాబందుల జనాభా 2007 నాటికి 99శాతం క్షీణించింది. దీనికి ప్రధాన కారణం పశువుల వైద్యంలో ఉపయోగించే డైక్లోఫినాక్. రాబందులకు ప్రాణాంతకమైన ఈ మందును కేంద్రం 2006లో నిషేధించింది. డైక్లోఫినాక్ ఇచ్చిన జంతువుల కళేబరాన్ని తిన్న రాబందుల్లో విసర్జన వ్యవస్థ పాడైపోతుంది. డైక్లోఫినాక్ ఇచ్చిన ఒక జంతు కళేబరం 350 నుంచి 800 రాబందులకు ప్రాణాంతకం కాగలదు.

అదే లక్ష్యం కాదు...

ప్రస్తుతం కొన్ని రాబందుల సంరక్షణ కేంద్రాల్లో వాటి సంఖ్య పెరగడం ఒక్కటే విజయానికి ప్రమాణం కాదు. ఎక్కువ మొత్తంలో అవి తిరిగి అడవుల్లో స్థిరపడగలగాలి. వాటికి సురక్షితమైన ఆహారం లభించాలి. విషపూరిత ఔషధాలు, విద్యుదాఘాతాలు, విషప్రయోగాలు, నివాస ప్రాంతాల నష్టం వంటి ముప్పుల నుంచి రాబందుల సహజ ఆవాసాలను రక్షించాలి. ముఖ్యంగా డైక్లోఫినాక్ నిషేధాన్ని ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలి. రాబందుల మనుగడ ప్రకృతికీ మానవాళికీ ఎంత అవసరమో ప్రజలందరికీ తెలియజెప్పాలి.

ఒక రచయిత... ముప్పై కోట్ల పుస్తకాలు

ముంబయిలో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర పుస్తకాలమ్మే కుర్రాడు ఒక కారు తలుపు తట్టి 'జెఫ్రీ ఆర్చర్ లేటెస్ట్ బుక్... కొనుక్కుంటారా సార్' అంటూ చేతిలోని పుస్తకాన్ని చూపించాడు. 'దానికన్నా లేటెస్ట్ జెఫ్రీ ఆర్చర్‌ని నేనే' అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు కారులోని వ్యక్తి. 2019లో జైపుర్ లిటరేచర్ ఫెస్టివల్‌కి వచ్చినప్పుడు జెఫ్రీ ఆర్చర్ చెప్పారీ మాట. ముంబయి వీధుల్లో పిల్లలు రోడ్లమీద తన పుస్తకాల పైరేటెడ్ కాపీలను తక్కువ ధరకు అమ్మడం చూశానని వాళ్లకు తానే జెఫ్రీ ఆర్చర్‌నని చెబితే ఆశ్చర్యంగా చూసేవారని అన్నారు. నాలుగు రోజుల క్రితం కన్నుమూసిన ప్రఖ్యాత బ్రిటిష్ రచయిత జెఫ్రీ ఆర్చర్ 86ఏళ్ల జీవితంలో మొత్తం 59 రచనలు చేశారు. అందులో 31 నవలలు కాగా మిగిలినవి కథా సంపుటాలు, పిల్లల పుస్తకాలు, నాటకాలు. ఇవన్నీ కలిపి ముప్పైకోట్లకు పైగా అమ్ముడుపోయి ఉంటాయని అంచనా.



భారతీయులకు పాపులర్ ఇంగ్లిష్ నవలలు చదవడం అలవాటు చేసిన రచయితగా జెఫ్రీ ఆర్చర్‌ను పేర్కొనవచ్చు. ఆయన రచనలను ఇంగ్లిష్ సాహిత్యంలో ఫాస్ట్‌ఫుడ్‌గా అభివర్ణిస్తారు. కళ్లకు కట్టినట్లు సాగే థ్రిల్లింగ్ కథనం పుస్తకం అయిపోయేదాకా వదలనివ్వదు. తన పుస్తకాలు భారత్‌లో ఎక్కువగా అమ్ముడుపోతుండటంతో ఆయన తరచుగా ఇక్కడికి వస్తుండేవారు. కొత్త పుస్తకాలను ఆవిష్కరిస్తుండేవారు. భారతీయ క్రికెటర్లను, రచయిత ఆర్.కె.నారాయణ్‌ను ఎంతో అభిమానించేవారు. నారాయణ్ నోబెల్ సాహిత్య బహుమతికి అర్హులని ఆర్చర్ కొనియాడేవారు.

1940లో లండన్‌లో పుట్టిన ఆర్చర్ ఛారిటీ ఫండ్ రైజర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. 29 ఏళ్ల వయసుకే బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఒక పెట్టుబడి విషయంలో దెబ్బతిని పూర్తిగా దివాళా తీయడంతో ఇల్లు అమ్మేయడమే కాకుండా మరోసారి పార్లమెంటుకూ వెళ్లలేకపోయారు. జీవితంలో మళ్లీ విజయం సాధించడానికి ఆయన రచనను ఎంచుకున్నారు. స్వీయానుభవం నుంచి రూపుదిద్దుకున్న తొలి నవలను 'న్యాయంగా ఒక మిలియన్ సంపాదించడం చాలా కష్టం. అక్రమంగా సంపాదించడం కాస్త తేలికే. కానీ సంపాదించిన మిలియన్‌ని భద్రంగా ఉంచుకోగలగడం మాత్రం అన్నిటికన్నా కష్టం' అంటూ మొదలుపెట్టారు. ఆయన జీవితంలో లాగే రచనల్లోనూ అనూహ్యమైన ఎదుగుదల, పతనం, తిరిగి కోలుకోవడం... అనే థీమ్ ఎక్కువగా కనిపిస్తుంది.

1980ల్లో అటు బెస్ట్ సెల్లింగ్ రచయితగానూ ఇటు మార్గరెట్ థాచర్ దగ్గర కన్జర్వేటివ్ పార్టీ డిప్యూటీ చైర్మన్‌గానూ ఓ వెలుగు వెలుగుతున్న సమయంలో సెక్స్ స్కాండల్‌లో ఇరుక్కున్నారు ఆర్చర్. దాంట్లో గెలిచి పెద్ద మొత్తంలో నష్టపరిహారం పొందినప్పటికీ ఆ తర్వాత కోర్టును తప్పుదోవ పట్టించినట్లు తెలిసి 2001లో నాలుగేళ్ల జైలుశిక్ష పడింది. అంత డబ్బూ తిరిగి చెల్లించారు. జైలు జీవితం గురించి మూడు భాగాల ప్రిజన్ డైరీస్ రాసిన ఆర్చర్ 2024 వరకూ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యుడిగా ఉన్నారు. జెఫ్రీ ఆర్చర్ 1979లో రాసిన 'కేన్ అండ్ అబెల్' మూడు కోట్లకు పైగా అమ్ముడై, న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్స్ లిస్టులో తొలి స్థానాన్ని చేజిక్కించుకుంది. చివరి పుస్తకం 'ఆడమ్ అండ్ ఈవ్' ఆయన మరణించిన మరుసటిరోజు విడుదలైంది.

దూసుకొస్తున్న మురసు తుఫాన్

అమరావతి, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రవాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 23 కి.మీ. వేగంతో కదులుతుందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తీవ్ర వాయుగుండం చెన్నైకి 700కిలోమీటర్లు.. విశాఖపట్నానికి 770 కిలోమీటర్లు.. మచిలీపట్నానికి 770 కిలోమీటర్లు, ఒంగోలుకు 810 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. ఈ తీవ్ర వాయుగుండం మరో 6 గంటల్లో తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందంటున్నారు.

సోమవారం పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫాన్‌గా బలపడే ఛాన్స్ ఉందంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున దక్షిణకోస్తా తీరానికి సమీపంలోకి చేరుకునే అవకాశం ఉందని..మంగళవారం ఉదయం తీవ్ర తుఫాన్‌గా నెల్లూరు, నరసాపురం మధ్య దక్షిణ కోస్తా తీరాన్ని దాటే అవకాశం ఉందంటున్నారు. ఈ తుఫాన్‌కు మురసు పేరు పెట్టారు..



కాకపోతే ఈ తుఫాన్ రాష్ట్రంపై అర్నబ్ తుఫాన్ అంత ప్రభావం చూపకపోవచ్చనే అంచనాలు వేస్తున్నారు. వచ్చే మూడు రోజులు ఈ మురసు తుఫాన్ ప్రభావంతో దక్షిణ ఆంధ్రా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి కోస్తా తీరం వెంట గంటకు 40 నుంచి 85కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని భావిస్తున్నారు. మత్స్యకారులు బుధవారం వరకు సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. ఈ మురసు తుఫాన్ ప్రభావం కోస్తా జిల్లాలపై ఉంటుందని చెబుతున్నారు.

సోమవారం పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని అంచనా వేస్తున్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, చిత్తూరు, కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది అంటున్నారు. మంగళవారం విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

పులివెందుల ఆర్వో ఆఫీస్ ముందు వైఎస్ జగన్ నిరసన

వైసీపీ ఏజెంట్లతో కలిసి బైఠాయింపు

అమరావతి, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరసనకు దిగారు. పులివెందుల రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పులివెందుల ఎన్నికల్లో జరిగిన భారీ అక్రమాలు, ఘర్షణలు, దాడులు రిగ్గింగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. దీంతో ఆయన దగ్గరకు వచ్చిన అధికారులతో జగన్ మాట్లాడారు. ఈ సందర్భంగా పులివెందులలో రీపోలింగ్ నిర్వహించేలా నిర్ణయం తీసుకోవాలని అధికారులను కోరారు. మీకు పైనుంచి ఆదేశాలు ఏమైనా రావచ్చు.. ఎటువంటి ఒత్తిళ్లు వచ్చినా మీ అధికారాన్ని వినియోగించాలని, ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్న వారిని అడ్డుకోవాలని వైఎస్ జగన్ వారితో అన్నారు.

అలాగే అధికారుల తీరుపై జగన్ మండిపడ్డారు. మీరు ఏం చేసినా ఇక రెండేళ్లే, ఆ తర్వాత వచ్చేది మా ప్రభుత్వమే, ఇప్పుడు జరిగిన అన్ని ఘటనలపై విచారణ చేయిస్తామని జగన్ హెచ్చరించారు. తాను పిలుపును ఇచ్చి ఉంటే ఈ ఎన్నికలు ఆగిపోయేవని, ప్రజాస్వామ్యంపై ఉన్న గౌరవంతోనే అలా చేయలేదని ఆయన అన్నారు. పోలీసులే స్వయంగా ఏజెంట్ల ఫారాలు తీసుకోవడం ఏమిటని, వెంటనే పులివెందుల ఎన్నికలను రద్దు చేయాలని, రీ పోలింగ్ నిర్వహించాలని కోరారు. ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు, సీసీ కెమెరాల ఫుటేజ్‌లు, దాడుల వివరాలు, దొంగ ఓట్ల వివరాలతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని RO చిన్నయ్యకు జగన్ అందజేశారు. ఆయనతో పాటు 70 మంది పోలింగ్ ఏజెంట్లతో కలసి ఆయన ఆందోళనలో పాల్గొన్నారు.

పులివెందులలో ఉద్రిక్తత..

ఈ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సందర్భంగా పులివెందులలో ఆదివారం ఉదయం నుంచి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా 11, 12వ పోలింగ్ బూత్‌ల దగ్గర రాళ్ల దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుకుంటున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల దగ్గర తమను రానివ్వడం లేదని వైసీపీ ఏజెంట్లు గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ వర్గీయులు తమను అడ్డుకుంటున్నారని నిరసనకు దిగారు. కడపలో కూడా దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొందని వైసీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. అయితే పోలీసులు చర్యలు తీసుకుని.. పరిస్థితిని అదుపులోకి తెస్తున్నారు.

ఈ ఎన్నికలు రద్దు చేసి, రీపోలింగ్ నిర్వహించాలి

పులివెందుల, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్న తీరు దారుణంగా ఉందని.. చంద్రబాబు ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. పులివెందులలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. పులివెందులతో పాటుగా రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. అధికార పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని.. ఇంతకంటే దుర్మార్గం మరొకటి ఉండదన్నారు జగన్. టీడీపీ వాళ్లు పోలింగ్ బూత్‌లను ఉదయం 4 గంటల నుంచే ఆక్రమించుకున్నారన్నారు.

పులివెందుల మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి మొత్తం 80 బూత్‌ల్లో 70 చోట్ల వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అడ్డుకున్నారని మండిపడ్డారు జగన్.



టీడీపీ గూండాలు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి దొంగ ఓట్లు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమని.. ఇదేం ప్రజాస్వామ్యం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే పులివెందులలో ఈ ఎన్నికలు రద్దు చేసి రీ పోలింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఓటు వేయడానికి వచ్చిన వారిని వెనక్కి పంపుతున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ఎస్పీలు, కలెక్టర్లకు ఫోన్ చేసినా స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పులివెందులలో వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి ప్రమీలమ్మపై దాడి చేశారు. అలాగే ఓటర్ల స్లిప్పులను బలవంతంగా లాక్కుని వెనక్కి పంపారన్నారు జగన్. మరీ దారుణంగా అభ్యర్థులను బలవంతంగా అరెస్టులు చేశారని ఆరోపించారు. పోలింగ్ అక్రమాలను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై దాడి చేసి.. వారి కెమెరాలను ధ్వంసం చేశారన్నారు. పులివెందుల మాత్రమే కాదు కడప జిల్లా జమ్మలమడుగు, చిత్తూరు, పల్నాడు జిల్లా మాచర్ల, అనంతపురం జిల్లా తాడిపత్రి, అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఓట్లు వేయనివ్వడంలేదని ఆరోపించారు. ఇవన్నీ చూసిన తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు ఒక్కరోజు కూడా అర్హుడు కాదని ధ్వజమెత్తారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించడం లేదని ఆరోపించారు జగన్. పోలింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్, సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా ఎన్నికల పోలింగ్ నిర్వహించడం సరికాదని.. రీపోలింగ్ జరపాలని ఆర్వోను కోరతామన్నారు వైఎస్ జగన్. ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

కడపలో హింసకు వైసీపీ ముందస్తు స్కెచ్

- నారా లోకేశ్ సంచలన ఆరోపణలు
- నేరపూరిత శక్తుల వ్యవహారాన్ని
- ఎన్నికల అధికారులు చూసుకుంటారు
- ఓటర్లందరూ ఓటేయాలని విజ్ఞప్తి

అమరావతి, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో పురపాలక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నాయని, కడప జిల్లాల్లో మాత్రం హింసకు పాల్పడేందుకు వైసీపీ ముందుగానే సిద్ధమైనట్లు కనిపిస్తోందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కడపలో ప్రతిపక్షం తీరు అనుమానాస్పదంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు నారా లోకేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుండగా, కడపలో మాత్రం వైసీపీ పార్టీ 'ముందస్తు సన్నద్ధతతో' వచ్చినట్లు కనిపిస్తోంది. ఇటువంటి నేరపూరిత శక్తుల వ్యవహారాన్ని ఎన్నికల అధికారులు చూసుకుంటారు.. ఓటర్లందరూ పెద్ద సంఖ్యలో బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నాను." అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

కడపలో ఉద్రిక్తత...

కడప జిల్లాలోని పులివెందులలో పోలింగ్ ప్రక్రియ ఉద్రిక్తతంగానే సాగుతుంది. అక్కడ ఓట్లను వేయనివ్వడం లేదని వైసీపీ ఆరోపిస్తుంది. సుమారు 70 మంది వైసీపీ పోలింగ్ ఏజెంట్లతో ఎంపీ అవినాశ్ రెడ్డి ఆర్వో కార్యాలయానికి చేరుకోవడంతో పోలీసులు అతనిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇది రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నేతల ఫిర్యాదు..

మరోవైపు కడప, పులివెందులతో పాటు రాష్ట్రంలో పలుచోట్ల జరుగుతున్న హింసాత్మక ఘటనలపై స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య టీమ్ కంప్లైంట్ చేసింది. ఘర్షణలకు, హింసకు పాల్పడుతున్న నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు రావని తెలిసే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆందోళన చేస్తున్నారని మండిపడ్డారు. పులివెందులోనైనా పరువు కాపాడుకుందామని జగన్ ప్రయత్నిస్తున్నారని ఎద్దేవ చేశారు.

కాగా ఆంధ్రప్రదేశ్‌లోని 92 పట్టణ స్థానిక సంస్థలకు ఆదివారం పోలింగ్ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 22 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలియజేశారు. విశాఖపట్నం, విజయనగరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో కూడా పోలింగ్ సజావుగా సాగుతుంది.

ఇండియా కూటమి ర్యాలీలో పాల్గొనం: సీజేపీ

అమరావతి, నవంబర్ 01, అనంత జనశక్తి న్యూస్

ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొనబోమని, తాము తటస్థంగా ఉంటామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. తమ సంస్థ గుర్తింపును కాపాడుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీని దీప్కే కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఇటీవలే జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన సీజేపీ ఆందోళనలకు మద్దతు ఇచ్చినందుకు మమతకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అలాగే తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను పోలీసులు అరెస్టు చేసినపుడు కూడా మమత తమ వెంట ఉన్నారని తెలిపారు.

కాగా.. రామ్ లీలా మైదానంలో ఇండియా కూటమి చేస్తున్న ర్యాలీపై మాట్లాడుతూ.. ర్యాలీకి మద్దతు తెలుపుతున్నామని దీప్కే వెల్లడించారు. అయితే, ఆ ప్రదర్శనలో తాము పాల్గొనబోమని చెప్పారు. 'సీజేపీ అనేది ఒక స్వతంత్ర సంస్థ. మేము మా గుర్తింపును కాపాడుకోవాలనుకుంటున్నాం. అదే సమయంలో ఇండియా కూటమి ర్యాలీకి మేము మద్దతు తెలుపుతున్నాం. అంతేకాకుండా ఓట్ చోరీపై పోరాడే ఏ పార్టీకైనా మేము మద్దతు ఇస్తాం' అని దీప్కే వ్యాఖ్యానించారు.

దీప్కేపై మమత ప్రశంసలు

ఎన్నికల సంఘం, సర్ అక్రమాలపై అభిజీత్ దీప్కే, సీజేపీ నేతలు చేస్తున్న పోరాటం అభినందనీయమని మమతా బెనర్జీ అన్నారు. మీడియాతో ఆమె మాట్లాడారు. ఇండియా కూటమి ర్యాలీకి సీజేపీ నేతలు వారి పూర్తి మద్దతు తెలిపారని, ఆ ర్యాలీకి సంఘీభావం ప్రకటించారని ఆమె వెల్లడించారు. వారిని చూస్తే తనకు గర్వంగా ఉందన్నారు. ప్రస్తుత ఉద్యమానికి వారే మార్గదర్శకులు, వ్యవస్థాపకులు అని కొనియాడారు. ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా పట్టు వదలకుండా పోరాడుతున్నారని చెప్పారు.

ఇస్రో సందర్శనకు ఎంపికైన భూపాలపల్లి యువకుడు

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్ట్ 23వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు జరిగిన ఈ నేషనల్ స్పేస్ డేక్విజ్ పోటీలో దేశవ్యాప్తంగా అనేక మంది పాల్గొన్నారు. అయితే వారందరిలో అనిల్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. టాప్ 100 విజేతల్లో రెండో స్థానాన్ని సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అనిల్ కుమార్.. హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో ఉంటున్నాడు. చదువుతో పాటు అంతరిక్ష పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచుకున్న ఆయన.. జాతీయ స్థాయి క్విజ్‌లో పాల్గొని తన ప్రతిభను నిరూపించుకున్నాడు. సాధారణంగా పోటీ పరీక్షల సన్నద్ధతలో నిమగ్నమయ్యే యువతకు భిన్నంగా, ఇలాంటి విజ్ఞాన పోటీల్లోనూ పాల్గొని విజయం సాధించడం విశేషం.

ఈ నేషనల్ స్పేస్ డే క్విజ్‌లో టాప్ 100 విజేతలకు బహుమతిగా ఇస్రోను సందర్శించే అవకాశాన్ని మైగవ్ కల్పిస్తోంది. ఇందులో భాగంగా అనిల్



కుమార్‌కు కూడా ఆహ్వానం అందింది. నవంబర్ 20వ తేదీన చెన్నై నుంచి ఇస్రోలోని శ్రీహరికోట కేంద్రాన్ని సందర్శించే అవకాశం కల్పించనున్నట్లు మైగవ్ పంపిన సమాచారంలో పేర్కొంది. ఈ సందర్శనలో భాగంగా నవంబర్ 19వ తేదీన చెన్నైలోని హోటల్‌లో బస చేయాల్సి ఉంటుందని తెలిపింది. విజేతలు తమ సొంత ప్రాంతం నుంచి చెన్నైకి వెళ్లి తిరిగి రావడానికి థర్డ్ ఏసీ రైలు ప్రయాణ ఛార్జీలను మైగవ్ తిరిగి చెల్లించనుంది. స్థానిక ప్రయాణ ఖర్చుల కోసం రూ.500 కూడా అందించనుంది.

హోటల్ వసతి.. చెన్నై నుంచి ఇస్రో కేంద్రానికి వెళ్లి తిరిగి రావడానికి రవాణా సదుపాయాలను కూడా నిర్వాహకులే ఏర్పాటు చేయనున్నారు. ఈ అవకాశాన్ని ఖరారు చేసుకునేందుకు నవంబర్ 5వ తేదీలోగా తమ అంగీకారాన్ని తెలియజేయాలని విజేతలకు మైగవ్ సూచించింది. ఇస్రో సందర్శన ద్వారా భారత అంతరిక్ష రంగంలో శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు, ప్రయోగాలు, సాధిస్తున్న విజయాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం అనిల్ కుమార్ లభించనుంది. ఈ అరుదైన అవకాశంపై అతడు సంతోషం వ్యక్తం చేశాడు. ఇది తనకు మరింత ప్రేరణను ఇస్తుందని.. భవిష్యత్తులోనూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించేందుకు ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నాడు.

ఒక చిన్న గ్రామం నుంచి వచ్చి జాతీయ స్థాయి పోటీలో రెండో స్థానం సాధించడం అనిల్ కుమార్ కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆయన సాధించిన విజయంతో మల్లారం గ్రామంతో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చదువుతో పాటు విజ్ఞాన రంగాలపై ఆసక్తి పెంచుకుంటే గ్రామీణ ప్రాంతాల యువత కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగలరనే సందేశాన్ని ఈ విజయం అందిస్తోంది.

సీఈసీని పదవి నుంచి తొలగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఓటు చోరీ అనేది సాధారణ దొంగతనం కాదని.. దేశంలోని ప్రతి పౌరుడి గొంతును దొంగిలించడమేనని అన్నారు. దీన్ని దేశద్రోహంతో పోల్చారు. 2024 ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా, ఓటర్ల జాబితాలను మార్చడం ద్వారా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఎన్నికల తర్వాత 15 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించారని.. ఇండియా కూటమి, ఎన్డీయే మధ్య ఓట్ల తేడా 3 శాతమే ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ గణాంకాల ఆధారంగానే 2024 ఎన్నికలు చట్టబద్ధమైనవి కావంటూ తన వాదనను వినిపించారు. ఈ సభలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయన పదవిలో కొనసాగడానికి వీల్లేదని.. భవిష్యత్తులో పదవి నుంచి తొలగించబడతారని అన్నారు. అంతే కాకుండా జైలుకు వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ లేకపోతే నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి, అమిత్ షా కేంద్ర హోంమంత్రి అయ్యేవారు కాదని ఆరోపించారు.దేశంలోని విద్యా వ్యవస్థ నుంచి దర్యాప్తు సంస్థల వరకు అనేక రాజ్యాంగ, ప్రభుత్వ సంస్థలపై ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగిందని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు.దీని వల్ల రైతులు, కార్మికులు, యువతకు రావాల్సిన హక్కులు దక్కడం లేదని అన్నారు. డబ్బు, అధికారంతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ ప్రాధాన్యతను వివరించిన రాహుల్ గాంధీ.. ఎంతటి ఆర్థిక శక్తి ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అంతం చేయడానికి తాము అనుమతించబోమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.కేంద్రంతో పాటు మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వాలు కూడా ఓట్ల చోరీ ద్వారానే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రజలు వారిని ఎన్నుకోవడం లేదని.. వారే తమకు తాముగా అధికారాన్ని కట్టబెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మోదీ ప్రధాని పదవి నుంచి దిగిపోతేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని అన్నారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సహా ఇండియా కూటమికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం పనితీరుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతకుముందు మింటో రోడ్‌కనాట్ ప్లేస్ కూడలి నుంచి 'చలో ఢిల్లీ' పేరుతో ర్యాలీ ప్రారంభమై రామ్‌లీలా మైదానానికి చేరుకుంది. అక్టోబర్ 31వ తేదీన సీఈసీకి వ్యతిరేకంగా నిర్వహించిన ప్రతీకాత్మక అభిశంసన కార్యక్రమం తర్వాత ఈ భారీ సభ జరిగింది.

బీజేపీ ఎదురుదాడి.. ఎస్ఐఆర్‌కు మద్దతుగా కేంద్ర మంత్రి

మరోవైపు ఇండియా కూటమి ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం కోల్పోయాయని బీజేపీ నేత ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో.. అరాజకతా హటావో' పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థించారు. ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో దేశంలో భారీగా వలసలు, పట్టణీకరణ జరిగాయని, ఒకే వ్యక్తి పాత నివాస ప్రాంతంతో పాటు కొత్త ప్రాంతంలోనూ ఓటరుగా నమోదయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు.

గత 20 ఏళ్లలో సుమారు 40 కోట్ల మంది వలస వెళ్లగా.. దాదాపు 20 కోట్ల మంది మరణించారని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ వివిధ దశల్లో సుమారు 13 కోట్ల ఎంట్రీలను తొలగించగా.. అందులో 2.8 కోట్ల మంది మరణించిన వారి పేర్లు ఉన్నాయని.. మరో 1.9 కోట్ల కొత్త పేర్లను చేర్చినట్లు వివరించారు. అనర్హుల పేర్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదుతో ఎన్నికల జాబితాలను ప్రక్షాళన చేయడమే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని చెప్పారు.

ఎన్నికల సంఘం వాదన.. ప్రతిపక్షాల ఆందోళన

ఓటర్ల జాబితాల సవరణపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా.. ఎన్నికల సంఘం మాత్రం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం లేదని స్పష్టం చేస్తోంది. పొరపాటున పేర్లు తొలగించబడిన ఓటర్లు తిరిగి నమోదు చేసుకోవచ్చని పేర్కొంటోంది. మరోవైపు ఎస్ఐఆర్‌లో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించడం, ఓటర్ల నమోదు ప్రక్రియలో పారదర్శకతపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. దీంతో దేశంలో ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితాల ప్రక్షాళన, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాలు రాజకీయ చర్చలో కీలకంగా మారాయి.

కేంద్రంతో పాటు అనేక రాష్ట్రాల్లో ప్రజాతీర్పును చోరీ చేసి భాజపా అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈడీ వంటి సంస్థలతో విపక్షాలను భయపెట్టేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, అయినప్పటికీ తాము భయపడే ప్రసక్తే లేదన్నారు. దిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. పౌరులను విభజించి, వారి ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకూ పోరాడతామన్నారు. ఆయన్ను కాపాడేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని, ఈ దేశ యువత, మహిళలు వారిని వదిలిపెట్టరని అన్నారు.


గద్దె దించుతాం అఖిలేష్

ఉత్తర్‌ప్రదేశ్ ద్వారా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వారిని గద్దె దించుతామని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. యూపీ ఓటర్లు వారికి తగిన వీడ్కోలు పలుకుతారన్నారు.రాంలీలా మైదానం నూతన చరిత్ర లిఖించనుందని, మార్పు ఎప్పుడైనా రావచ్చని తెలిపారు. ప్రతి లాఠీ దెబ్బకు తదుపరి తరం ప్రతీకారం తీర్చుకుంటుందని, కాషాయ పార్టీ తనను తాను కాపాడుకోలేదని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో యూపీలోనే కాకుండా కేంద్రంలోనూ భాజపా ఓటమి చవిచూడక తప్పదన్నారు.

బెంగాల్ బాధిత రాష్ట్రం దీదీ

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు బెంగాల్ బాధిత రాష్ట్రమని తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ అన్నారు. మోసాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని, పోరాటం చేస్తామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి తెస్తామని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. బాధ్యతల నుంచి సీఈసీ ఎప్పుడు వైదొలగుతారోనని ఎదురుచూస్తున్నామని అన్నారు.

అన్నోజిగూడలో వైభవంగా బోడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

కందుకూరు, నవంబర్ 01, (అనంత జలశక్తి):

రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలం, అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో అత్యంత వైభవంగా నిర్వహించిన త్రయాహ్నిక దీక్షతో కూడిన పవిత్ర శ్రీ శ్రీ శ్రీ శీతల బోడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠా మహోత్సవం బోనాల పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి.మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రతిష్ఠాపన వేడుకల్లో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి నాభిశిలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ వేడుకల్లో కాకి దశరథ్ , గోరెంక రామకృష్ణ, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ వార్డు సభ్యుడికి రూ.2 లక్షల ఎల్వోసి చెక్కు అందజేసిన



- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం , నవంబర్ 01, (అనంత జనశక్తి):

67వ మంఖాల్ డివిజన్ హర్షగూడ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు ఇస్లావత్ రవి నాయక్ తండ్రి భద్రు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.
వారి ఆపరేషన్ కు సహాయంగా మన ప్రియతమ నాయకురాలు, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రోత్సాహంతో రూ.2,00,000 (రెండు లక్షల రూపాయల) ఎల్వోసి , సీఎం సహాయ నిధి చెక్కును సబితా ఇంద్రారెడ్డి అందజేశారు.హర్షగూడ మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్ సహకారంతో బాధిత కుటుంబానికి ఈ చెక్కును అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు రాజు నాయక్, మాజీ బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు వర్తయ్య సురేష్ నాయక్, యువ నాయకుడు రామావత్ రమేష్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు..

-ఆర్యవైశ్య యువజన సంఘం.



ధర్మ వరం నవంబర్1,అనంత జనశక్తి న్యూస్ :

పట్టణంలోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని కాలేజీ సర్కిల్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ.... పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష, ఆయన చేసిన ప్రాణత్యాగం తెలుగు ప్రజల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి అని తెలిపారు. ఆయన త్యాగ ఫలితంగా 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అనంతరం 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించింది అని తెలిపారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం కూడా నవంబర్ 1వ తేదీని ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరుపుకుంటున్నారు అని తెలిపారు.ఎందరో మహానుభావుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని, తెలుగు భాషా సంస్కృతులను భావితరాలకు అందించాలని తెలిపారు.

సజావుగా మున్సిపల్ ఎన్నికలు.. 77.09 శాతము నమోదు.

- -మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య.

ధర్మ వరం నవంబర్1,అనంత జనశక్తి న్యూస్ :



పట్టణంలోని 48 వార్డులలో గల 1,06,250 మంది జనాభా గల ప్రజలు నవంబర్ ఒకటవ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు 134 బూత్ కేంద్రాలలో తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు అని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.....మొత్తం జనాభాలో 5 రౌండ్లకు గాను తాత్కాలికంగా 5వ రౌండ్ వచ్చేసరికి 81,908 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని, మున్సిపల్ ఎన్నికల్లో 77.09 శాతము పోలింగ్ నమోదు కావడం జరిగిందని తెలిపారు. 134 కేంద్రాలలో బ్యాలెట్ బాక్సులను పట్టణంలోని బిఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలీసుల భద్రత నడుమ బందోబస్తుతో వాటిని పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అధికార పూర్వకంగా రాత్రి 9 గంటలకు మొత్తం ఎన్ని ఓట్లు నమోదు అయ్యాయి? ఎన్ని ఓట్లు నమోదు కాలేదు? ఎంత శాతం అనేది వివరాలు తెలపగలమని తెలిపారు. మొదటి రౌండులో (రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం) 7,154 మందితో ప్రారంభమై రెండవ రౌండ్లో 38,630 మంది, మూడవ రౌండ్ లో 57,613 మంది, 42 లో 69,683 మంది, చివరి అయిదవ రౌండ్ లో తాత్కాలికంగా నమోదైన ఓట్లు 81,908 నమోదు కావడం జరిగిందని తెలిపారు. మొత్తం మీద 77.09 శాతం నమోదు కావడం జరిగింది అన్నారు.ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు పోలీస్ శాఖకు, సిబ్బందికి, ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగస్తులకు పేరుపేరునా ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి, కమిషనర్ తన కృతజ్ఞతలను తెలియజేశారు.

కుటీర పరిశ్రమలు ఏర్పాటు కోసం యువత ముందుకు రావాలి

- చిన్న తరహా పరిశ్రమల తోనే యువత కు ఉపాధి అవకాశాలు
- మహేశ్వరంలో ఆర్సీఎం ఆక్వా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబర్ 01, (అనంత జనశక్తి):



కుటీర పరిశ్రమలు ఏర్పాటు కోసం యువత ముందుకు రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.మహేశ్వరం పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్సీఎం ఆక్వా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ కుటీర పరిశ్రమ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ పరిశ్రమను మహేశ్వరం శాసనసభ్యురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటైతే ఆయా ప్రాంతాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.ఆర్సీఎం ఆక్వా పరిశ్రమ ద్వారా కొంతమందికైనా ఉపాధి లభించనుండటం సంతోషకరమైన విషయమని, పరిశ్రమ నిర్వాహకులు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.మహేశ్వరం పట్టణ కేంద్రంలో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా అందుబాటులోకి రావడంతో పాటు, పరిశ్రమ నిర్వహణలో పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఏర్పడిందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో కంపెనీ చైర్మన్ రెవెల్లి చంద్రమౌళి, మేనేజింగ్ డైరెక్టర్ రెవెల్లి రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగలూరి తేజకృష్ణ తో పాటు రెవెల్లి కుటుంబ సభ్యులు, బంధువులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారికి ఘనంగా స్వాగతం పలికారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహేశ్వరం పట్టణ సర్పంచ్ మునగ పాటి నవీన్, ఉప సర్పంచ్ రమేష్, కర్రోళ్ల చంద్రయ్య, పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్,ఆనందం, సమీర్, హర్షగూడ మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్, తుక్కుగూడ యువ నాయకుడు సామెల్ రాజు,బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, గ్రామ ప్రజలు, రెవెల్లి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన

- మీర్‌పేట్ లో బిఎంవై ట్రస్ట్ భారీ ర్యాలీ
- పార్టీలకు అతీతంగా కరువు నివారణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- బిఎంవై ట్రస్ట్ వ్యవస్థాపకులు బాచనమోని ముఖేష్ యాదవ్

మహేశ్వరం , నవంబర్ 01, (అనంత జనశక్తి):



ఎల్‌నినో ప్రభావం, రాబోయే కరువు పరిస్థితులు, నీటి కొరతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని మీర్‌పేట్ డివిజన్ లో బిఎంవై ట్రస్ట్ ఆధ్వర్యంలో* ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు.బిఎంవై ట్రస్ట్ వ్యవస్థాపకులు బాచనమోని ముఖేష్ యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని మీర్‌పేట్, జిల్లెలగూడ కాలనీల్లో ఫ్లకార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు నీటి సంరక్షణ, కరువు నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్రపు నీటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగడాన్ని ఎల్‌నినో అంటారని, దీని ప్రభావంతో భారతదేశంలో రుతుపవనాల వర్షాలు తగ్గి, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత, కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. సమాజం ఎదుర్కొనే సమస్యలపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, శుక్ర, శనివారాల్లో ఆయా కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలకు పాంప్లెట్లు పంపిణీ చేసి ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు సంభవించి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని కోరారు.బిఎంవై ట్రస్ట్ కేవలం ఒక సంస్థగా కాకుండా సమాజ శ్రేయస్సు కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే వేదికగా పనిచేస్తుందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఇలాంటి సామాజిక అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని యువతకు, ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో *బద్దుల రాజు యాదవ్, వేముల వంశీ గౌడ్, షేక్ ఫరూక్, కొరిగంజ శేఖర్, బిల్ మల్లికార్జున్ యాదవ్, బిల్ శివ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాలు లేని సమాజమే ప్రపంచశాంతికి మార్గం

రంగారెడ్డి నవంబర్ 1 (అనంత జనశక్తి)



ప్రపంచమంతా యుద్ధ భయంతో అశాంతి వాతావరణంలో జీవిస్తున్న ప్రస్తుత తరుణంలో, ఈ భూగోళంపై యుద్ధాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రంగారెడ్డి జిల్లా మహాసభలో ముఖ్య అతిథులు పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల పరిరక్షణ, దేశాల సార్వభౌమాధికారానికి గౌరవం, ప్రజాస్వామ్య-సెక్యులర్ విలువల పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని నేతలు స్పష్టం చేశారు.
అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రంగారెడ్డి జిల్లా మహాసభ ఆదివారం టీవీన్నీవో భవన్‌లో తిప్పర్తి మహేష్, పల్లె వినయ్ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభను ప్రారంభించిన సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవిఎల్ మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధ భయంతో జీవిస్తున్నాయని అన్నారు. ఏ క్షణంలో యుద్ధాల కారణంగా దేశాలు, మానవ సమాజం అతలాకుతలమవుతుందోనన్న ఆందోళన నెలకొని ఉందని పేర్కొన్నారు. యుద్ధాలు లేని సమాజ నిర్మాణమే అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు.
ప్రపంచ శాంతి కోసం యూరప్ దేశాల్లో ప్రజలు లక్షల సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహిస్తూ యుద్ధోన్మాదానికి, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా తమ గొంతును వినిపిస్తున్నారని గుర్తుచేశారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సెక్యులర్ విలువలను పరిరక్షించడం ద్వారానే ప్రజల సంక్షేమం, దేశ ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల్లో చైతన్యం పెంచుతూ శాంతియుత సమాజ నిర్మాణానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
సంఘం అధ్యక్ష మండలి సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచ ప్రజల చైతన్యం ముందు నియంతృత్వ, యుద్ధోన్మాద శక్తులు నిలవలేవని చరిత్ర స్పష్టం చేస్తోందన్నారు. ప్రపంచ మానవాళి హక్కుల పరిరక్షణ, అన్ని దేశాల సార్వభౌమాధికారానికి గౌరవం, ఐక్యరాజ్యసమితి విధివిధానాల అమలు కోసం శాంతి ఉద్యమకారులు పోరాడుతున్నారని తెలిపారు. ప్రపంచంలో శాంతి, సంక్షేమం, అభివృద్ధి సాధన కోసం ప్రజలందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.
అధ్యక్ష మండలి సభ్యుడు తిప్పర్తి యాదయ్య మహాసభల పథకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు రాజకీయ పార్టీలుగా, ఇతర అంశాలపై విభిన్నంగా ఉన్నప్పటికీ శాంతి విషయంలో మాత్రం ఒక్కటిగా నిలవాలని అన్నారు. పాలకులు తమ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకు సమాజంలో విభజనలు, అశాంతి, అభద్రతను సృష్టించే ప్రయత్నాలు చేస్తుంటారని ఆరోపించారు. ఈ పరిణామాలను ప్రజలంతా అర్థం చేసుకుని న్యాయం, శాంతి, అభివృద్ధి కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.
రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ సమత మాట్లాడుతూ కుల, మత రహిత సమాజ నిర్మాణం కోసం అనేక మంది పోరాటం చేస్తున్నారని తెలిపారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో మానవతా విలువలు మరింత బలపడాలని, కులమత భేదాలకు అతీతంగా ప్రజలు ఆలోచించే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. ఇటీవల మృతదేహాలను కులమతాచారాలకు అతీతంగా వైద్య, విద్యా అవసరాల కోసం ఆసుపత్రులకు అందించే మానవతా దృక్పథం పెరుగుతుండటం మంచి సంప్రదాయమని ఆమె అభిప్రాయపడ్డారు.
ఈ మహాసభలో రాష్ట్ర నాయకులు పల్లె వినయ్, తిప్పర్తి మహేష్, పోలగాని రవికిషోర్, ప్రజానాట్యమండలి నాయకుడు పల్లె నరసింహ, వి. గణేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కలకొండ కాంతయ్య, వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగాచారి, నిర్వాహకులు ఇరుగు శ్రీధర్, పల్లె వెంకన్న,చిత్రం సైదులు, శ్రీశైలం గౌడ్, జీనుకుంట్ల లింగయ్య, ఆంజనేయులు, పరమేష్, నాగేశప్ప, నరసింహ, క్రాంతి, శ్రీనివాస్, అరుణ్ గౌడ్, మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడులో ఉన్మాది దాడిలో గాయపడిన బాలికను సొంత కూతురిలా చూసుకుంటా

- బాలిక ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది
- వచ్చే 48 గంటలు చాలా కీలకం, బాలిక సురక్షితంగా ఇంటికి రావాలని ప్రార్థిద్దాం
- విద్యార్థుల రక్షణే మా మొదటి ప్రాధాన్యత
- దాడులు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపడతాం
- దాడికి పాల్పడిన యువకుడిపై న్యాయబద్ధంగా కఠిన చర్యలు తీసుకుంటాం
- బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన మంత్రి లోకేష్
- బాలికకు అందుతున్న చికిత్సపై వైద్యులతో చర్చించిన మంత్రి

బెంగళూరు నవంబర్ 01 అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లా రాప్తాడులో ఉన్మాది దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను సొంత కూతురిలా భావించి అండగా ఉంటానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు ఓల్డ్ హాల్ ఎయిర్ పోర్ట్ రోడ్డులోని మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి లోకేష్.. అమానుష దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. బాలిక ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.. రాప్తాడులో ఉన్మాది ఘటనలో గాయపడిన బాలికకు అనంతపురంలో చికిత్స చేసిన అనంతరం గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఇక్కడి వైద్యులు సుమారు 12 గంటలపాటు శ్రమించి బాలికకు అనేక శస్త్రచికిత్సలు చేశారు. అనంతరం ఐసీయూకి తరలించారు.

వచ్చే 48 గంటలు చాలా కీలకం


బాలిక ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. వచ్చే 48 గంటలు చాలా కీలకం.రాష్ట్ర ప్రజలందరూ బాలిక ఆరోగ్యం గురించి ప్రార్థించాలి. బాలిక చాలా స్ట్రాంగ్ గా ఉంది. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకుంటుంది. అన్ని విధాలా అండగా నిలబడుతుంది. జరిగిన ఘటనతో పాఠశాలలో విద్యార్థులు భయాందోళనలో ఉన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందిస్తున్నాం. ఇది ఒక్క రోజులో జరిగేది కాదు. వచ్చే ఏడాది పాటు మానిటరింగ్ చేస్తాం.

విద్యార్థుల రక్షణే మా మొదటి ప్రాధాన్యత

పాఠశాలలో మొదటి పీరియడ్ ప్రారంభమైన వెంటనే గేట్లు మూసివేస్తాం. సదరు పాఠశాలలో భవిత సెంటర్ నిర్మాణం జరుగుతుండటంతో కార్మికుడి ముసుగులో వచ్చి సదరు యువకుడు దారుణానికి పాల్పడ్డాడు.దాడి ఘటనను చాలా సీరియస్ గా తీసుకుంటున్నాం. మరోసారి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపడతాం. విద్యార్థుల రక్షణే మా మొదటి ప్రాధాన్యత. పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. దాడికి పాల్పడిన వ్యక్తిపై న్యాయబద్ధంగా, కఠినమైన చర్యలు ఏపీ ప్రభుత్వం తీసుకుంటుంది. మహిళలపై దాడులకు పాల్పడే వారికి అదే చివరి రోజు అవుతుందని గతంలోనే హెచ్చరించడం జరిగింది. అలాంటి కఠినమైన, న్యాయబద్ధమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది. ఎవరినీ ఉపేక్షించేది లేదు.


బాలిక సురక్షితంగా ఇంటికి రావాలని ప్రార్థిద్దాం

బాలిక కుటుంబ సభ్యులను కూడా కలిశాను. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చాను. ఏ అవసరం వచ్చినా సంప్రదించాలని చెప్పాను. ప్రభుత్వ పరంగానే కాకుండా, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నేను, స్థానిక శాసనసభ్యురాలిగా పరిటాల సునీత గారు అండగా ఉంటామని ధైర్యం చెప్పాను. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వచ్చే 48 గంటలు మేం నిరంతరం పర్యవేక్షిస్తాం. ఇక్కడి వైద్యులు అద్భుతంగా స్పందించారు. వైద్యులతో పాటు పోలీసులను కూడా అభినందిస్తున్నాను. గ్రీన్ ఛానల్ ఇవ్వాలని కోరిన వెంటనే తక్షణమే స్పందించి తగిన ఏర్పాట్లు చేశారు. బాలికను సురక్షితంగా తరలించారు. ఇలాంటి ట్రామా కేసును ఇక్కడి వైద్యులు ఎప్పుడూ చూడలేదు. 12 గంటల పాటు నిరంతరం శ్రమించారు. వచ్చే 48 గంటలు చాలా కీలకం. బాలిక సురక్షితంగా ఇంటికి రావాలని అందరం ప్రార్థిద్దామని మంత్రి లోకేష్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.అంతకుముందు బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి లోకేష్.. బాలికకు అందుతున్న చికిత్సపై ఆసుపత్రి వైద్యులతో సుదీర్ఘంగా చర్చించారు. విద్యార్థినికి అవసరమైన శస్త్రచికిత్సలను ఇప్పటికే విజయవంతంగా పూర్తిచేశామని, బాలిక ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాలిక ఆరోగ్య పరిస్థితికి వచ్చే 48 గంటలు చాలా కీలకమని వివరించారు. బాలిక ప్రాణాలు కాపాడేందుకు మణిపాల్ ఆసుపత్రి వైద్యులు చేస్తున్న కృషికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో పీడియాట్రిక్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ కు వెళ్లి బాలికను చూశారు. బాలిక తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.



ఏం చేసినా మలబద్ధకం తగ్గట్లేదా, ఆముదం ఒక్కటి చాలు ప్రాబ్లమ్ సాల్వ్, ఎలా వాడితే కడుపుమొత్తం ఖాళీ అవుతుందంటే

కొలన్.. అంటే మన పేగు ఆరోగ్యం ఎలా ఉంటే మన శరీర పనితీరు అలా ఉంటుంది. మనం ఏవైనా జీర్ణ సమస్యలతో బాధపడినప్పుడు అది ఆటోమేటిగ్గా శారీరకంగా, మానసికంగా డిస్టర్బ్ చేస్తుంది. దీని వల్ల మొత్తం మన లైఫ్‌స్టైల్ దెబ్బతింటుంది. అందుకే, ముందుగా మన పేగు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. పేగు ఆరోగ్యంలో ముఖ్యంగా మలబద్ధకం చాలా పెద్ద సమస్యగా మారుతుంది. ముందునుంచీ దీనిని ఎప్పటికప్పుడు కంట్రోల్ చేసుకోవాలి. ఎప్పుడైతే మలబద్ధకం మన దరికి రాదో అప్పుడు జీర్ణ ఆరోగ్యం మెరుగ్గా మారి మన ఆరోగ్యం కూడా బాగానే ఉంటుంది. దీనికోసం ఎప్పటికప్పుడు కడుపుని క్లీన్ చేసుకోవాలి. మలబద్ధకం తగ్గేందుకు ఏం చేయాలి. పేగు మొత్తం క్లీన్ అయ్యేందుకు ఆముదం బాగా పనిచేస్తుంది. నేచురల్‌గానే సమస్యని దూరం చేసుకోవడానికి హెల్ప్ అవుతుందని చెబుతున్నారు సద్గురు.



సద్గురు ప్రకారం

ఆముదం అనేది నేచురల్ క్లెన్సర్. దీనిని మనం మన డైట్‌లో యాడ్ చేస్తే లోపలి నుంచి పేగులు క్లీన్ అవుతాయి. రోజూ హాఫ్ స్పూన్ ఆముదాన్ని గోరువెచ్చని నీరు, పాలలో కలపి తాగాలి. అది కూడా రాత్రి పడుకునే ముందు. దీని వల్ల ఉదయానికల్లా కడుపు మొత్తం క్లీన్ అవుతుంది. ఇలా కడుపు క్లీన్ అయ్యే క్రమంలో మన బాడీలోని ట్యాక్సిన్స్ బయటికెళ్లిపోయి ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీని వల్ల నీరసం, అలసట వంటివి ఉండవు. ఆముదంలో లాక్సేటివ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి నేచురల్‌గానే మలబద్ధకాన్ని తగ్గిస్తాయి.

ఎలా పనిచేస్తుందంటే

ఆముదం తీసుకుంటే బాడీలో బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. దీని వల్ల పేరుకుపోయిన వ్యర్థాలన్నీ బయటికి వెళ్లిపోతాయి. కడుపు మొత్తం ఖాళీ అవుతుంది. ఈ కారణంగా బాడీ లైట్‌గా ఫీల్ అవుతుంది. దీంతో మొత్తం ఆరోగ్యానికే మేలు జరుగుతుంది. మలబద్ధకం తగ్గేందుకు రకరకాల మందులు తీసుకునే బదులు ఇలా నేచురల్‌గా పనిచేసే ఆముదాన్ని మనం తీసుకోవచ్చు. దీంతో చాలా వరకూ మలద్ధకం తగ్గుతుంది.



ఆయుర్వేదంలో

ఆయుర్వేదం ప్రకారం ఆముదం క్లెన్సింగ్, హీలింగ్‌కి చక్కని ఔషధంలా వాడొచ్చు. దీనిని మన డెయిలీ లైఫ్‌లో యాడ్ చేస్తే చాలా వరకూ సమస్యలు తగ్గుతాయి. దీనిని తీసుకోవడం వల్ల శరీరం లోపల నుంచి చాలా సమస్యలు దూరమవుతాయి. మైండ్ కూడా క్లియర్‌గా ఉంటుంది. సద్గురు ప్రకారం



మనం పేగు ఆరోగ్యాన్ని ఎప్పుడైతే కాపాడుకుంటామో అప్పుడు మొత్తం ఆరోగ్యం మెరుగ్గా మారుతుంది. రోజూ రాత్రుళ్ళు కొద్దిగా ఆముదాన్ని గోరువెచ్చని పాలు, నీటిలో కలిపి తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యల్ని దూరం చేసుకున్నవారవుతారు.

సమస్య ఉన్నప్పుడు

మనం మలబద్ధకంతో బాధపడినప్పుడు ఇలా ఆముదాన్ని తీసుకోవడం వల్ల చాలా వరకూ సమస్య తగ్గుతుంది. బాడీలోని ట్యాక్సిన్స్ అన్నీ బయటికి వెళ్లిపోయి జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది. ఈ కారణంగా మొత్తం ఆరోగ్యానికే చాలా మంచిది. కాబట్టి, సమస్య ఉన్నప్పుడు మలబద్ధకాన్ని నేచురల్ రెమిడీగా వాడండి. అయితే, మోతాదు మాత్రం రోజుకి హాఫ్ స్పూన్ పరిమాణానికి మాత్రం మించొద్దు.

గమనిక

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.


సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎక్కువగా ఫైబర్ ఫుడ్ తీసుకోవాలి.
నీరు ఎక్కువగా తాగాలి.
ఒత్తిడిని తగ్గించుకోవాలి. దీనికోసం మెడిటేషన్ వంటివి చేయొచ్చు.
ఏదైనా ఓ వర్కౌట్ చేయడం మంచిది.
జంక్, ప్రాసెస్డ్ ఫుడ్స్‌ని వీలైనంతగా అవాయిడ్ చేయాలి.

ముఖంపై నల్ల మచ్చలు + ముడతలు తగ్గేందుకు స్టార్ హీరోయిన్ చెప్పిన చిట్కా



ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ అందంగా ఉండాలని కోరుకుంటారు. ముఖ్యం అమ్మాయిలు అందంపై ప్రత్యేక దృష్టి పెడతారు. అందుకే బ్యూటీ ట్రెండ్స్ ఎప్పటికప్పుడు మారుతూ.. ఆరోగ్యకరమైన చర్మాన్ని కాపాడుకోవడానికి సాయపడతాయి. బ్యూటీ హ్యాక్స్, బ్యూటీ టిప్స్ గురించి ప్రతి రోజూ సోషల్ మీడియాలో అనేక వీడియోలు, పోస్టులు దర్శనమిస్తున్నాయి. చాలా మంది సెలబ్రిటీలు తమ బ్యూటీ టిప్స్‌ను అభిమానుల కోసం పంచుకుంటున్నారు. ఇక, సౌత్ టాప్ హీరోయిన్ నటి తమన్నా భాటియా తనకు ఇష్టమైన DIY ఫేస్ మాస్క్‌ల్ని ఎలా తయారు చేయాలో చూపిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను షేర్ చేసింది. వీడియోలో తమన్నా చిన్నప్పటి నుంచి ఈ ఫేస్ మాస్క్‌ను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఈ మాస్క్‌ను తమన్నాకి ఆమె తల్లి చెప్పారు. ముఖంపై నల్ల మచ్చలతో పాటు ముడతలు తగ్గించే ఫేస్ మాస్క్‌ల్ని ఎలా తయారు చేసుకోవాలి, ఎలా అప్లై చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.



ఫస్ట్ ఫేస్ మాస్క్ కోసం కావాల్సిన పదార్థాలు

* గంధపు పొడి (చందనం) - 1 టీస్పూన్
* తేనె - 1 టీస్పూన్
* కాఫీ పొడి - 1 చెంచా
* రోజ్ వాటర్ - కొద్దిగా

తయారీ విధానం

ముందుగా గిన్నెలో ఒక టీ స్పూన్ చందనం పొడి, ఒక టీ స్పూన్ కాఫీ కలపండి. ఆ తర్వాత ఒక టీ స్పూన్ తేనె కలిపి బాగా పేస్టులా తయారు చేసుకోండి. ఈ పేస్ట్ చాలా మందంగా ఉంటే కొద్దిగా రోజ్ వాటర్ కలపండి. ఈ పేస్టును ముఖానికి బాగా అప్లై చేసి.. 10 నుంచి 15 నిమిషాలు అలాగే ఉంచండి. అది బాగా ఆరిన తర్వాత ముఖాన్ని క్లీన్ చేసుకోండి. ఆ తర్వాత తేడాను మీరే గమనిస్తారని తమన్నా భాటియా అంటున్నారు.

ఈ ఫేస్ మాస్క్ వల్ల ప్రయోజనాలు

* చర్మానికి చల్లదనం ఇస్తుంది. ఈ మాస్క్‌లో ఉపయోగించే గంధం చర్మానికి శీతలీకరణ ప్రభావాన్ని అందించడంలో సాయపడుతుంది. ఇది చర్మాన్ని చల్లగా ఉంచడంలో సాయపడుతుంది.
* కాఫీ పొడిలో యాంటీ ఆక్సిడెంట్, ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మాన్ని లోతుగా శుభ్రపర్చడంలో సాయపడతాయి.



తేనెలో యాంటీ బ్యాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సాయపడతాయి.

* ముఖానికి సహజ మెరుపు వస్తుంది. చర్మం యొక్క సహజ కాంతిని కాపాడటానికి సాయపడుతుంది.

చందనం పొడిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు నల్ల మచ్చల్ని తగ్గించి మీ చర్మాన్ని ప్రకాశవంతం చేయడంలో సాయపడతాయి.

* టానింగ్, నల్ల మచ్చల నుంచి ఉపశమనం లభిస్తుంది. కాఫీ, చందనం పొడి రెండూ నల్ల మచ్చల్ని తగ్గించడంలో ప్రభావవంతగా ఉంటాయి. కాఫీ, గంధపు పొడి రెండింటిలో ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని లోతుగా శుభ్రపరుస్తాయి. ఇది టానింగ్, నల్ల మచ్చలు, పిగ్మెంటేషన్ తగ్గించడంలో సాయపడుతుంది.

తమన్నా చెప్పిన రెండో ఫేస్ మాస్క్‌కి కావాల్సిన పదార్థాలు

* శనగ పిండి - ఒక టీ స్పూన్
* ప్లేన్ యోగర్ట్ లేదా పెరుగు - ఒక టీ స్పూన్
* రోజ్ వాటర్ - ఒక టీ స్పూన్

తయారీ విధానం

ఈ ఫేస్ ప్యాక్ తయారీకి ముందుగా ఒక గిన్నెలో శనగపిండి, పెరుగు వేసి బాగా మిక్స్ చేసుకోవాలి. ఆ తర్వాత ఒక టీ స్పూన్ రోజ్ వాటర్ కలిపి.. పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టును ముఖానికి, మెడకి అప్లై చేసుకోవాలి. ఈ ఫేస్ మాస్క్‌ని 15 నిమిషాల పాటు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

ప్రయోజనాలు

ఈ ఫేస్ మాస్క్ అప్లై చేసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. శనగపిండి మృత చర్మాన్ని తొలగించడంలో సాయపడుతుంది. పెరుగు చర్మాన్ని మృదువుగా హైడ్రేట్ చేస్తుంది.

ఏం జరిగిందో తెలుసుకోకుండానే అంచనాలు!

"ఎవరు.. ఎవరి కామెంట్లకు, స్టోరీలకు స్పందించారు అనే పోలికతో నన్ను ట్యాగ్ చేయడం, నాకు మెసేజ్ చేయడం ఆపండి. నేను మీ ప్రేమను నిజంగా గౌరవిస్తాన"ని అంటున్నారు కథానాయిక అనుపమ పరమేశ్వరన్. తాజాగా ఆమె ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండా.. డబుల్ స్టాండర్డ్స్, నెటిజన్లు ఇతరులను అంచనా వేసే విధానాల గురించి ఇన్‌స్టా వేదికగా ఒక స్టోరీని పంచుకున్నారు. "తెర వెనుక అసలు ఏం జరిగిందో తెలుసుకోకుండా సోషల్ మీడియాలో చూసినదాని ఆధారంగానే నెటిజన్లు ఓ అభిప్రాయానికి వస్తున్నారు. ఒకప్పుడు మనం గిల్టీగా భావించిన విషయాలే ఇప్పుడు పరిస్థితులు తారుమారైనప్పుడు మాత్రం మామూలుగా మారిపోతాయి. సంతోషాన్ని వ్యక్తపరచడం, మీకు మద్దతు ఇచ్చే వారిని అభినందించడం, చిన్న చిన్న క్షణాలను ఆస్వాదించడమే కొన్నిసార్లు అనవసరమైన విమర్శలకు దారితీస్తాయి. కొన్నిసార్లు అసలు మనం ఏం చేశామనేది కాదు, దాన్ని చేయడానికి ఎవరికి అనుమతి ఉందనేది తెలుస్తుంది. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అసలు ఏమి జరిగిందో తెలియకుండానే చూసిన వాటి నుంచే అంచనాలకు వచ్చేస్తారు. కానీ జీవితం అంటే ఇదే కదా..! మన క్యారెక్టర్ మారిపోయిప్పుడు మన నియమాలు కూడా మారిపోతాయి. సోషల్ మీడియాలో అభిమానులతో మాట్లాడటం నాకు ఇష్టం. ఇది కొత్తగా వచ్చిన అలవాటేమీ కాదు. ఇలాంటి సంభాషణల వల్ల నా మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. కాబట్టి నేను దీన్ని ఇలాగే కొనసాగించాలనుకుంటున్నా" అని ఆ స్టోరీలో రాశారు అనుపమ.



డ్యూడ్ దర్శకుడి చిత్రంలో నయన్?

ఓ పక్క అగ్ర హీరోలతో నటిస్తూ, మరో పక్క నాయిక ప్రాధాన్య చిత్రాలతో అలరిస్తున్నారు అగ్ర కథానాయిక నయనతార. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఆమె మరో కొత్త ప్రాజెక్టుకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో రూపొందనున్న ఓ చిత్రంలో నటించనున్నారట. 'డ్యూడ్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన కీర్తిశ్వరన్ తన రెండో ప్రాజెక్టులో తమిళనాడు సీఎం, ప్రముఖ కథానాయకుడు విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ హీరోగా నటించనున్నట్లు ఇటీవలే వార్తలొచ్చాయి. తాజాగా ఈ క్రమంలోనే కీర్తిశ్వరన్ కథానాయకుడు శింబుని సంప్రదించినట్లు తెలిసింది. ఈ సినిమా చిత్రీకరణ డిసెంబరులో ప్రారంభం కానుందని సినీవర్గాల సమాచారం. నయనతార, శింబు జోడీగా 'వల్లభ', 'ఇందు నమ్మా ఆలు' అనే చిత్రాలొచ్చాయి. మరోసారి వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రంలో ఎలా కనిపించనున్నారో తెలియాలంటే కొన్నిరోజులు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం నయన్ 'డియర్ స్టూడెంట్స్', 'ఎస్‌వీసీ63' లాంటి పలు సినిమాల్లో నటిస్తున్నారు. ఈమె త్వరలోనే 'మహాశక్తి' చిత్రంతో ప్రేక్షకులను పలకరించనున్నారు.



రాజకీయాల్లోకి వెళ్తా!

ఈ దీపావళికి 'సీన్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమయ్యారు కథానాయకుడు సూర్య. 'కరప్ప', 'విశ్వనాథ్ అండ్ సన్స్' విజయాల తర్వాత ఈ ఏడాది తన నుంచి వస్తున్న మూడో చిత్రమిది. జితూ మాధవన్ తెరకెక్కించిన ఈ సినిమాని జ్యోతిక - సూర్య సంయుక్తంగా నిర్మించారు. నజ్రియా కథానాయిక. నస్లేన్ ప్రతినాయక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం చెన్నైలో ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. సూర్య ఇందులో డీఎస్పీ ప్రేమ్‌రాజ్ అనే పాత్రలో కనిపించనున్నారు. ట్రైలర్‌లో ఆయన కనిపించిన తీరు.. తన పాత్రని తీర్చిదిద్దిన విధానం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. నస్లేన్ ఇందులో ఈశ్వరన్ అనే ఓ సైకో కిల్లర్ తరహా పాత్రలో అలరించనున్నట్లు అర్థమవుతోంది. తనని పట్టుకునేందుకు డీఎస్పీ ప్రేమ్‌రాజ్ చేసిన సాహసాలేంటి.. ఈ ప్రయాణంలో తనెదుర్కొన్న సవాళ్లేంటి? అన్నది ఆసక్తికరం. ట్రైలర్ ఆఖర్లో లాల్ "కెరీర్ పరంగా ఇప్పుడు పీక్‌లో ఉన్నప్పుడు ఉద్యోగానికి రాజీనామా చేసి ఏం చేస్తావు" అని ప్రశ్నించగా.. "రాజకీయాలు.. రాజకీయాల్లోకి వెళ్తా" అని సూర్య బదులివ్వడం ఆసక్తిరేకెత్తించింది.



5 వేల ఏళ్ల క్రితమే అలాంటి వాహనం



భారతీయ పురాణాల్లోని అద్భుతమైన విషయాల్లో పుష్పక విమానం ఒకటని బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ కు చెందిన 'టెస్లా' ఇటీవల ఫ్లయింగ్ కారును ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో 5 వేల ఏళ్ల క్రితమే అలాంటి వాహనం ఉండేదని రణ్‌బీర్ తెలిపారు. 'రామాయణ' ప్రమోషన్లలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎలాన్ మస్క్ కంపెనీ టెస్లా ఇటీవల ఫ్లయింగ్ కారును ఆవిష్కరించింది. కానీ, భారత్‌లో 5 వేల ఏళ్ల క్రితమే అలాంటి వాహనం ఉంది" అని రణ్‌బీర్ పేర్కొన్నారు. 'రామాయణం'లో పుష్పక విమానాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. కాగా, అక్టోబర్ 15న టెస్లా తన కొత్త రోడ్‌స్టర్ కారును ప్రదర్శించింది. 2028 నాటికి ఈ కారును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే ఈవెంట్‌లో.. శ్రీరాముడి పాత్రలో నటించడం తనకు జీవితంలో ఒక్కసారి మాత్రమే దక్కే గొప్ప అవకాశమని రణబీర్ అభివర్ణించారు.

రికార్డు 'ఎఫ్1'పై ఆంటోనెలి గురి



మెక్సికో సిటీ: స్టార్ రేసర్ కిమి ఆంటోనెలి (ఇటలీ) చరిత్రాత్మక ఎఫ్1 టైటిల్‌పై గురి పెట్టాడు. 20 ఏళ్ల ఈ కుర్రాడు సీజన్లో ఇప్పటికే తొమ్మిది గ్రాండ్‌ప్రి టైటిళ్లు నెగ్గాడు. ఇదే ఊపులో మెక్సికో సిటీ రేసునూ గెలిచి, అతిపిన్న వయసులో ఫార్ములా 1 ఛాంపియన్‌షిప్ దక్కించుకున్న రేసర్‌గా చరిత్ర సృష్టించాలని ఆంటోనెలి పట్టుదలగా ఉన్నాడు. 2010లో ఎఫ్1 గెలిచిన సెబాస్టియన్ వెటెల్ (23 ఏళ్లు) పేరిట ప్రస్తుతం ఈ రికార్డు ఉంది. కొద్ది రోజుల ముందు అనారోగ్యం బారిన పడిన ఆంటోనెలిపై.. ప్రాక్టీస్‌లో ఆ ప్రభావం పడలేదు. క్వాలిఫికేషన్‌కు ముందు జరిగే తొలి రేసులో రెండో స్థానం సాధించిన ఈ మెర్సీడెజ్ రేసర్.. రెండోసారి నాలుగులో నిలిచాడు. ఆంటోనెలి ఎఫ్1 ఛాంపియన్‌గా నిలవడానికి మెక్సికో గ్రాండ్‌ప్రి గెలవాల్సిన అవసరం లేదు.. కనీసం తొమ్మిది లేదా అంతకంటే తక్కువ స్థానాల్లో రేసును ముగిస్తే అతడికే ట్రోఫీ దక్కుతుంది. ఎందుకంటే ప్రస్తుతం ఈ ఇటలీ రేసర్ ఎఫ్1 స్టాండింగ్స్‌లో 365 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. మరో మెర్సీడెజ్ రేసర్ జార్జ్ రసెల్ (242) అతడి తర్వాత ఉన్నాడు.

ముగింపులో మెరిసేదెవరో!



హామిల్టన్: సిరీస్ ఫలితం ముందే తేలిపోయినప్పటికీ.. ఆదివారం భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే చివరి టీ20 అమితాసక్తిని రేకెత్తిస్తోంది. మూడు వరుస ఓటములతో సిరీస్ కోల్పోయాక నాలుగో మ్యాచ్‌లో కివీస్ జూలు విదిల్చింది. తమ టీ20 చరిత్రలోనే అత్యధిక స్కోరు (259) సాధించి, భారత్‌ను ఏకంగా 87 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఈ ఊపులో ఇంకో విజయం సాధించి గౌరవప్రదంగా టీ20 సిరీస్‌ను ముగించాలని, వన్డే సిరీస్‌లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాలని చూస్తోంది. ఇక భారత్ చివరి మ్యాచ్‌లో గెలిచి తన ఆధిపత్యాన్ని చాటి వన్డే సిరీస్‌కు మరింత ఉత్సాహంగా సిద్ధమవ్వాలని భావిస్తోంది. మూడో టీ20లో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ జోడీ కివీస్ బౌలర్లపై ఎలా చెలరేగిపోయిందో, భారత్ ఎంత సులువుగా గెలిచేసిందో తెలిసిందే. కానీ ఇషాన్ కిషన్ గాయం నుంచి కోలుకోవడంతో వైభవ్‌ను తప్పించి అతణ్నే తుది జట్టులో ఆడించారు. తిరిగి సంజు శాంసన్‌తో ఓపెనింగ్ చేయించారు. కానీ ఈ ఇద్దరూ విఫలమవడంతో భారీ ఛేదనలో భారత్ తేలిపోయింది. వైభవ్ మెరుపులు మెరిపిస్తున్నప్పటికీ.. అతడికి ఎప్పుడో కానీ అవకాశాలివ్వట్లేదు టీమ్‌ఇండియా. జట్టులోని మిగతా ఆటగాళ్లకూ అవకాశాలిస్తూ, అతణ్ని జాగ్రత్తగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. బాగా ఆడుతున్న కుర్రాడిని బెంచ్‌లో కూర్చోబెట్టడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఫైనల్లో సింధు, లక్ష్య

సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత స్టార్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ హైలో ఓపెన్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సింధు 21-13, 21-16తో మరో భారత షట్లర్ అన్మోల్ ఖర్బ్‌పై నెగ్గింది. ఈ మ్యాచ్ తొలి గేమ్ ఆరంభంలో అన్మోల్ 4-2తో ఆధిక్యంలో నిలిచింది. అక్కడ నుంచి సింధు పుంజుకుంది. సహచర షట్లర్ నుంచి పోటీ ఎదురైనా.. విరామ సమయానికి 11-9తో నిలిచింది. అదే జోరు ఆపై కూడా కొనసాగిస్తూ గేమ్ గెలుచుకుంది. రెండో గేమ్ ఒక దశలో 8-8తో హోరాహోరీగా సాగింది. ఆపై అన్మోల్ గట్టిపోటీ ఇచ్చినా.. దూకుడుగా ఆడిన సింధు.. గేమ్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ ఫైనల్ చేరాడు. సెమీస్‌లో అతడు 21-17, 21-13తో తోమా పాపోవ్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. తొలి గేమ్‌లో మాత్రమే పాపోవ్ నుంచి లక్ష్యకు గట్టిపోటీ ఎదురైంది.



తాడోపేడో తేల్చుకోవాల్సిన మ్యాచ్ కాదుగా

న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20 తుది జట్టు ఎంపికపై మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ అసహనం వ్యక్తం చేశాడు. దాదాపు నాలుగేళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన సీమర్ భువనేశ్వర్ కుమార్ ను మూడు మ్యాచ్‌లకే తప్పించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించాడు. ప్రస్తుత భారత బౌలర్ల ఎకానమీ భారీగా ఉందని.. జట్టు యాజమాన్యం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నాడు.

"భువీని నాలుగో టీ20 నుంచి డ్రాప్ చేయడంతో నేను ఆశ్చర్యపోయాను. భారత్-న్యూజిలాండ్‌లో కలిపి 10 నుంచి 11 మంది బౌలర్లు ఉన్నారు. అందరి ఎకానమీలు భారీగానే ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నారు. ఈ క్రమంలో భువీని ఎందుకు డ్రాప్ చేశారో నాకు అర్థంకాలేదు. ఈ పరిస్థితుల్లో అతడు ఒక్కడినే తీసుకోలేరా..?

అతడు నాలుగేళ్ల తర్వాత జట్టులోకి వచ్చాడు. మరోవైపు సిరీస్ ఇప్పటికే గెలిచాం. మీరు ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికైనా.. తాడోపేడో తేల్చుకునే మ్యాచ్‌లేమీ లేవు. జట్టు నిర్ణయంతో నేను ఏకీభవించను. అతడికి సిరీస్ మొత్తంలో అవకాశాలు దక్కాల్సింది. మీకు అతడి సామర్థ్యం తెలుసు. అలాంటప్పుడు రెండు మూడు మ్యాచుల్లో పేలవంగా ఆడినా అండగా ఉండాలి. జట్టులో బుమ్రా ఎలాగూ లేడు.. ఉన్నవాళ్లంతా కొత్తవారే. అతడు అనుకున్న స్థాయిలో రాణించకపోవడంతో అందరూ కొంత నిరాశ చెందిన మాట వాస్తవమే. భువీ కూడా ఇదే విషయం గ్రహించి ఉంటాడని నమ్మకంగా చెప్పగలను. వాస్తవానికి మిగిలిన బౌలర్లు కూడా పరుగులు సమర్పించుకున్నారు. ఐదు మ్యాచుల్లో అతడికి అవకాశం ఇచ్చాక విశ్లేషించి ఉండాల్సింది. తొందరపాటు నిర్ణయం తీసుకొన్నారు" అని మహమ్మద్ కైఫ్ పేర్కొన్నాడు.

కోహ్లీ సహనాన్ని పరీక్షించిన కొత్త బౌలర్

న్యూజిలాండ్‌తో వన్డేలకు సాధన చేస్తున్న టీమ్ ఇండియా క్యాంప్‌లో ఆదివారం ఉదయం ఓ ఆసక్తికర పరిణామం చోటు చేసుకొంది. ఇటీవలే జట్టులోకి అరంగేట్రం చేసిన ఓ యువ బౌలర్.. విరాట్ కోహ్లీ ని పదేపదే బీట్ చేసి సహనాన్ని పరీక్షించాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించిన అకీబ్ నబీ పదునైన బంతులతో తరచూ విరాట్‌ను బీట్ చేశాడు. చురుకైన ఇన్ డిప్పర్స్‌తో కోహ్లీ ప్యాడ్లను లక్ష్యంగా చేసుకోవడంతో.. కొన్ని అద్భుతమైన ఔట్ స్వింగర్లతో బోల్తా కొట్టించాడు. దీంతో తొలుత అసహనానికి గురైన కోహ్లీ తిరిగి తనదైన శైలిలో కుదురుకొన్నాడు. కొద్ది సేపు రోహిత్‌తో సరదాగా మాట్లాడి తిరిగి క్రీజులోకి వచ్చి నిలకడగా ఆడాడు. మరోవైపు యువ బౌలర్లు అన్ష్ ల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ కూడా వైవిధ్యమైన బౌలింగ్‌తో సాధనచేశారు. ఇక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అవసరమైన సమయంలో షాట్లు బాదుతూ సాధన చేశాడు. కేఎల్ రాహుల్, రుతురాజ్ గైక్వాడ్ కూడా పేసర్లను ఎదుర్కొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945